PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 313 | విజయవాడ, మంగళవారం 18 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 18 June 2024 | Rs


రోజుకొక సమస్య

- నిన్న విమల పాఠశాల మూసివేత
- నేడు గురజాడ కళాక్షేత్రం ఛార్జీలు పెంపు
- స్టీల్ యాజమాన్యంపై కార్మికుల్లో ఆగ్రహం

• లోపలి పేజీల్లో •



న్యూజిలాండ్ పేసర్ లూకీ ఫెర్గుసన్ టి20 క్రికెట్‌లో నయా చరిత్ర లిఖించాడు. ట్రినిడాడ్ వేదికగా పపువాన్యుగేనియాతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫెర్గుసన్ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లు తీశాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో 24 బంతులను 'డాట్ బాల్స్' (4-4-0-3)గా వేసిన తొలి బౌలర్‌గా రికార్డుపుటల్లోకెక్కాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 7వికెట్ల తేడాతో పపువాన్యుగేనియాపై ఘన విజయం సాధించింది.



24 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి ఐదు రోజులపాటు జరగనున్నట్లు సమాచారం. తొలుత ఈ నెల 19 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అత్యధిక శాతం మంత్రులు నేటికీ బాధ్యతలు తీసుకోకపోవడం, గవర్నరు బక్రీద్ పండగ సెలవులో ఉండటంతో సమావేశాల తేదీని ప్రభుత్వం మార్చినట్లు తెలిసింది. ముందుగా ప్రకటించిన విధంగా ఈ నెల 18న కేబినెట్ సమావేశం, 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగాల్సి ఉంది. అనివార్య పరిస్థితుల్లో సమావేశాల తేదీ మారడంతో ఈ నెల 22న కేబినెట్ సమావేశం జరిగే అవకాశమున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. సమావేశాల తేదీ మార్పుపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

విద్యా కానుక కిట్ల లెక్కలు తేలుస్తారా?

- మిగులును పట్టించుకోకుండా భారీ కొనుగోళ్లు
- కోట్లాది రూపాయల అవినీతి?

2

పోలవరం ప్రాజెక్టు చూస్తే బాధగా ఉంది

- ఈ ఘోర తప్పిదానికి ఎవరు బాధ్యత వహిస్తారో తేలాలి
- నష్టం చేసిన వారిపై చర్యలు
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన అనంతరం సిఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు నుండి వల్లభనేని సురేష్

పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత స్థితి చూస్తే బాధగా ఉందని, తీవ్ర ఆవేదన కలుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారి పోలవరం ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఉదయం 11.40కి ప్రాజెక్టు సమీపాన ఉన్న హెలిప్యాడ్ వద్దకు చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వ్యూ పాయింట్ వద్ద నుండి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో కలియదిరిగి ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సందర్శించారు. స్పిల్ వే, కాఫర్ డ్యాం, డయా ఫ్రం వాల్ తో పాటు 22, 23 గేట్ల దగ్గర నుండి ప్రాజెక్టును పరిశీలించారు. ఎడమగట్టు దగ్గర కుంగిన గైడ్ బండ్ ప్రాంతానికి వెళ్లారు. గ్యాప్-3 ప్రాంతం, ఎగువ కాఫర్ డ్యాం ప్రాంతాన్ని చూశారు. అధికారులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. డయా ఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అయిదేళ్ల తన కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారంటూ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పు చేశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును జగన్ అహంకారంతో సర్వనాశనం చేశారని విమర్శించారు. నష్టం చేసిన వారిపై చర్యలు తప్పవని అన్నారు.నాటి ప్రభుత్వ విధ్వంస తీరుకు పోలవరం ఒక కేస్ స్టడీ లాంటిదని చెప్పారు పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేసుకోగలిగితే రాష్ట్రానికి కరువు అనేది లేకుండా చేయొచ్చని భావించినట్లు చెప్పారు. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిలో 99 శాతం వాడుకునే అవకాశం ఉందని అన్నారు. 2014-19 మధ్య 72 శాతం మేర పనులను పూర్తి చేసినట్లు తెలిపారు.



పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు

సమాంతరంగా డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు

'గతంలో నేను సిఎంగా ఉన్నపుడు 30 సార్లు ప్రాజెక్టును సందర్శించా... ఇప్పుడు మళ్లీ 31వ సారి వచ్చాను.' అని అన్నారు. 'భూసేకరణలో కూడా బాధితులను ఒప్పించి ముందుకు వెళ్లాం. కానీ వైసిపి ప్రభుత్వం రాగానే రివర్స్ టెండర్ అంటూ ఏజెన్సీని మార్చారు, అధికారులను మార్చారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రెండుసార్లు వచ్చిన వరదలతో డయాఫ్రం వాల్ నాలుగు చోట్ల దెబ్బతింది. డయా ఫ్రం వాల్ 35 శాతం దెబ్బతింది. దీనివల్ల తీవ్ర నష్టం జరిగింది. డయాఫ్రం వాల్ పై గతంలో మేం ఖర్చు చేసింది రూ.446 కోట్లు అయితే... జగన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం రిపేర్లు చేయడానికి రూ.447 కోట్లు అవుతుంది... అయినా పూర్తిస్థాయిలో బాగవుతుందనే నమ్మకం లేదని అధికారులు చెప్తున్నారు. రెండో ప్రణాళిక ప్రకారం సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది.' అని చెప్పారు. 'ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యామ్ రూ.550 కోట్లతో నిర్మాణం జరిగింది. గత ప్రభుత్వ నిర్వాకంతో చివర్లో ఉన్న గ్యాప్ పూర్తి చేయకపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. గైడ్ బండ్ కూడా కుంగిపోయింది. ఇవన్నీ చక్కదిద్దాలంటే ఎన్ని వేల కోట్లు కావాలో ఇప్పటికీ అధికారుల వద్ద నిర్దిష్టమైన లెక్కలు లేవు. 2019 నుండి ఏజన్సీలను మార్చకుండా పనులు కొనసాగి ఉంటే 2020 చివరి నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది.

ఇప్పుడు ఈ రిపేరు పనులకే నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు చెప్తున్నారు. అది కూడా అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరిగితేనే" అని చంద్రబాబు అన్నారు.

చిక్కుముళ్లు వేశారు

"ఒక వ్యక్తి రాష్ట్రానికి శాపంగా మారతాడని చెప్పడానికి పోలవరం ఒక కేస్ స్టడీ. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలి... జరిగిన నష్టం ప్రతి ఒక్కరికీ తెలియాలి... ఏ ఒక్కటీ దాచిపెట్టకూడదు. కాఫర్ డ్యాం ద్వారా నీళ్ల లీకేజీ కంట్రోల్ అవ్వకపోతే డయాఫ్రం వాల్ పనులు చేయడం కుదరదు. లీకేజీ ద్వారా వచ్చిన నీళ్లు ఎత్తిపోయాలంటే భారీగా ఖర్చు అవుతుంది. జగన్ చేతకాని తనంతో ప్రాజెక్టుకు చిక్కుముళ్లు వేశారు.' అని అన్నారు.

లోతుగా అధ్యయనం చేస్తున్నా..

'నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు సందర్శనకు వస్తే అడ్డుకున్నారు. గతంలో మేము అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును ప్రజలకు చూపించాం. ఇది ప్రజల ప్రాజెక్టు. ఈ సీజన్ అయిపోయింది... డిసెంబర్ వరకూ ఏ పనీ చేయడానికి కుదరదు. ప్రాజెక్టుపై లోతుగా అధ్యయనం చేస్తున్నా.' అని చెప్పారు. 'పోలవరాన్ని వివాదాలకు కేంద్రంగా మార్చారు. ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలి... నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. కేంద్రంతో కూడా దీనిపై సంప్రదింపులు జరిపి ముందుకెళ్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎంఎల్ఎలు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- దిశా స్టేషన్లు మహిళా పోలీస్ స్టేషన్లగా మార్పు
- హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నూతన ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపనుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. వచ్చే మూడు నెలల్లో పోలీస్ శాఖలో సమూల మార్పులుంటాయన్నారు. సిఎంతో చర్చించి పోలీసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. దిశా పోలీస్ స్టేషన్లు సోమవారం నుంచి మహిళా పోలీస్ స్టేషన్లుగా పనిచేస్తాయన్నారు. విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా పోలీస్ యంత్రాంగంతో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో అనిత మాట్లాడుతూ వైసిపి హయాంలో విశాఖ నగరాన్ని కార్యనిర్వాహక రాజధానిగా మారుస్తామని చెప్పి గంజాయికి రాజధానిగా మార్చారని విమర్శించారు. గంజాయిని క్రీ లీఫ్ పేరుతో ఆన్‌లైన్‌లో అమెజాన్ కేంద్రంగా విక్రయించారని తెలిపారు. విశాఖ సెంట్రల్ జైల్లో గంజాయికి సంబంధించిన కేసుల్లో 1,286 మంది ఉండగా, మిగతా మొత్తం రాష్ట్రంలో 365 మందే ఉన్నారన్నారు. సెంట్రల్ జైలుకు వెళ్లి వారి స్థితిగతులపై త్వరలో సమీక్ష జరుపుతానన్నారు. సోమవారం రాత్రి నుంచే విశాఖ నగరవ్యాప్తంగా గంజాయి నియంత్రణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని పోలీస్ శాఖకు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. అంతకుముందు సింహాచలంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలో భయం లేకుండా వైసిపి ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు ఎవరైనా ఉంటే పద్ధతి మార్చుకోవాలని వ్యాఖ్యానించారు.

1 నుంచి క్రిమినల్ చట్టాలు అమలు

- కేంద్ర మంత్రి మేఘ్వాల్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నూతన క్రిమినల్ చట్టాలు వచ్చే నెల 1వ తేదీ నుండి అమలులోకి వస్తాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. అందరినీ సంప్రదించే ఈ చట్టాలు తీసుకొచ్చామని ఆయన చెప్పారు. నిర్ణయం తీసుకునే ముందు తమను సంప్రదించలేదంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఇది ఏకపక్ష నిర్ణయమేనని కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. 146 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి పార్లమెంటులో ఈ చట్టాలను ఏకపక్షంగా ఆమోదింపజేసుకున్నారని ఆరోపించింది. ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సిఆర్‌పిసి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఎవిడెన్స్ చట్టం స్థానంలో భారతీయ సాక్ష్య చట్టాన్ని తీసుకొస్తున్నామని మేఘ్వాల్ చెప్పారు. 'తమను సంప్రదించలేదని కొందరు చెబుతున్నారు. ఇది నిజం కాదు. వలసవాదుల కాలం నాటి చట్టాలను మార్చాలని చాలా కాలం నుండి డిమాండ్ ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఎప్పుడో మొదలైంది' అని ఆయన తెలిపారు. 'మేము ఎంపీలందరినీ సంప్రదించాం. అయితే ఉభయ సభలకు చెందిన 142 మంది సభ్యులు మాత్రమే స్పందించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేల నుండి సూచనలు కూడా కోరాము. వారిలో కేవలం 270 మంది మాత్రమే స్పందించారు. మేము విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపాము. కానీ ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు తెలియజేయలేదు' అని వివరించారు.

ప్రతిపక్షాలు లేకుండానే...

చట్టాలను మార్చేందుకు ఉద్దేశించిన బిల్లులకు లోక్‌సభ గత సంవత్సరం ఆమోదం తెలిపింది. అయితే పార్లమెంటులో జరిగిన భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో 97 మంది ప్రతిపక్ష సభ్యులను సభ నుండి సస్పెండ్ చేశారు. ప్రతిపక్షాలు లేకుండానే బిల్లులను ప్రభుత్వం సభలో ఆమోదింపజేసుకుంది. రాజ్యసభలోనూ ఇదే తంతు నడిచింది.

బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

- 'కాంచనగంగ'ను వెనక నుండి ఢీకొన్న గూడ్సు రైలు
- లోకో పైలట్ సహా 9 మంది మృతి
- 41 మందికి గాయాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 41 మంది గాయపడ్డారు. అసోంలోని సిల్చార్ నుండి కొల్‌కతాలోని సెల్దాకు వెళుతున్న కాంచనగంగ ఎక్స్‌ప్రెస్‌ను న్యూ జల్పాయిగురి స్టేషన్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఓ గూడ్సు రైలు వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో గూడ్సు రైలు బోగీలు చెల్లాచెదురు కాగా, ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. ఉదయం సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైల్వే సిబ్బంది, ఏడుగురు ప్రయణికులు మొత్తం తొమ్మిది మంది మరణించారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుందన్నారు. బోగీల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ సంస్థల సిబ్బంది కృషి చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో ఒకటి గాలిలో వేలాడుతూ కనిపించడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. గాయపడినవారిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయని, 32మందికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున అందజేస్తారు. ఎక్స్‌ప్రెస్ రైలు న్యూ జల్పాయ్‌గురి స్టేషన్ నుండి బయలుదేరిన కొద్దిసేపటికే దానిని, రాణిపాత్ర స్టేషన్, చత్తార్ హట్ జంక్షన్ మధ్య వెనుక నుండి గూడ్సు రైలు బలంగా ఢీకొంది. దీంతో గూడ్సు రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎక్స్‌ప్రెస్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. రెడ్ సిగ్నల్ వేసినా గూడ్సు రైలు లోకో పైలట్ పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారిలో గూడ్సు రైలు లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డు కూడా ఉన్నారు. ప్రమాదం నేపథ్యంలో న్యూ జల్పాయ్‌గురి, సిలిగురి జంక్షన్, బగ్‌డోగ్రా, అలువాబరి మార్గాల్లో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు. ప్రమాదం కారణంగా ఆ మార్గంలో అనేక రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తర బెంగాల్, దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుండి దూర ప్రాంతాలకు నడిచే రైళ్ల రాకపోకలపై కూడా ఈ ప్రమాదం ప్రభావం పడింది.



సంఘటనా స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

రైలు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మరోవైపు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

సిగ్నల్ జంపింగే కారణమా?

గూడ్స్ రైలు డ్రైవర్ తప్పేమీ లేదంటున్న రైల్వే వర్గాలు

• లోపలి పేజీలో •

శివారుకు సాగునీరు కష్టమే!

- కాలువల్లో కానరాని పూడికతీత
- వర్షాలు వస్తే ముంపే?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు శివారు భూములకు సాగునీరు అందుతుందా? వర్షాలు వస్తే ముంపు నుంచి పంటను కాపాడుకోగలుగుతామా? అనే సందేహాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైతులను వెంటాడుతున్నాయి. రుతుపవనాలు అనుకున్నట్టే కదులుతున్నాయి. వర్షాలు కూడా పడుతుండడంతో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే దుక్కి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో వారం పది రోజుల్లో నాట్లు కూడా వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి అవసరం చాలా ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి కాలువలు, ఏలేరు, పుష్కర, పిబిసి కాలువల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతోంది. ఒక్క గోదావరి కాలువల పరిధిలోనే నాలుగు లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. మెట్టలో ఏలేరు, పుష్కర, పిబిసి, సుద్ధగడ్డ కాలువల పరిధిలో మరో 1.20 లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగవుంతుంటాయి. గోదావరి డెల్టా కాలువలకు ఈ నెల ఒకటో తేదీ నుంచి నీటిని విడుదల చేస్తున్నా నేటికీ శివారు ఆయకట్టు పరిధిలోని సుమారు 42 వేల ఎకరాలకు నీరు చేరలేదు. తూర్పు డెల్టా ప్రధాన కాలువ కడియం లాకుల దిగువన పూర్తిగా పూడికతో నిండిపోయింది. సామర్లకోట, పెద్దాపురం మండలాలకు తాగునీరు, సామర్లకోట, అనపర్తి, బిక్కవోలు మండలాలకు ఈ కాలువ నీరే అందించాల్సి ఉంది. ఈ కాలువ కింద 62,453 ఎకరాల ఆయకట్టు ఉంది. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందే పరిస్థితి కనిపించట్లేదు. సెంట్రల్ డెల్టాకు సంబంధించి కొత్తపేట నుంచి ముక్కామల వరకూ కాలువ పూడికతో కుచించుకుపోయింది. 2.10 లక్షల ఎకరాలకు ఈ కాలువ నీరే శరణ్యం. ఇక్కడి డ్రెయిన్లు గుర్రపుడెక్క, చెత్తతో నిండిపోయాయి. పిఠాపురంలో ఏలేరు కాలువ పూడికతీత పనులు జరగక సాగునీరు మిగతా 2లో



కడియంలో గుర్రపుడెక్క, పచ్చగడ్డి, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన గోదావరి ప్రధాన కాలువ

టిడిపి అధ్యక్షులుగా పల్లా బాధ్యతల స్వీకరణ

- ప్రభుత్వానికి పార్టీకి మధ్య వారధి మీరే.. : చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రభుత్వానికి పార్టీకి మధ్య వారధి మీరేనని, సీనియర్ల సూచనలు, జూనియర్ల మద్దతుతో పార్టీలో యువ రక్తాన్ని చేర్చాలని పల్లా శ్రీనివాస రావుకు సిఎం చంద్రబాబు సూచించారు. ప్రతిపక్షంలో గత ఐదేళ్లుగా పడిన కష్టం, పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించి అతి పెద్ద బాధ్యత అప్పగించామన్నారు. ఉండవల్లి లోని సిఎం నివాసంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేష్‌కు పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పల్లాకు చంద్రబాబు పలు సూచనలు చేశారు. ప్రతి కార్యకర్తనూ దగ్గరకు తీసుకోవాలని, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ తరగతుల నుంచి యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలన్నారు. జులై నుంచి పార్టీ మెంబర్ షిప్ డ్రైవ్ కూడా పున:ప్రారంభించాలని సూచించారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి
- మరో ఇద్దరి అరెస్ట్

రాంచీ : జార్ఖండ్‌లోని ఛైబాసాలో భద్రతా దళాలతో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళ సహా నలుగురు మావోయిస్టులు మరణించారు. మరో ఇద్దరు అరెస్టయ్యారు. చనిపోయిన మావోయిస్టుల్లో ఒక జోనల్ కమాండర్, ఒక సబ్-జోనల్ కమాండర్ ఉన్నారు. ఛైబాసా (పశ్చిమ సింఘ్‌భుమ్)లోని కొల్హాన్ అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఉదయం ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయని, ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. మావోయిస్టుల మృతిని ఛైబాసా ఎస్‌పి అశుతోష్ శేఖర్ ధ్రువీకరించారు. 'ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నలుగురు మావోయిస్టుల్లో ఒకరు జోనల్ కమాండర్. మరొకరు సబ్-జోనల్ కమాండర్. ఇంకొకరు ఏరియా కమాండర్. మరొకరు మహిళా మావోయిస్టు' అని ఎస్‌పి వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ఇద్దరు మావోయిస్టులను భద్రతా దళాలు పట్టుకున్నాయని, వారిలో ఒకరు ఏరియా కమాండర్, మరొకరు కరడుకట్టిన మహిళా మావోయిస్టు అని చెప్పారు. సంఘటనా స్థలంలో మావోయిస్టుల మృతదేహాలతోపాటు పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, రోజువారీగా ఉపయోగించే కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గువా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు జరుపుతుండగా ఓ పొదలో కూర్చున్న మావోయిస్టులు విచక్షణారహితంగా కాల్పులు ప్రారంభించారని, భద్రతా దళాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని పోలీసు వర్గాలు తెలిపాయి. సంఘటనా స్థలం నుండి దట్టమైన అడవుల్లోకి పరారైన మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది. ఎన్‌కౌంటర్‌లో కొందరు మావోయిస్టులకు బులెట్ గాయాలైనట్లు తెలుస్తోంది. పశ్చిమ సింఘ్‌భుమ్ జిల్లాలోని సరందా అటవీ ప్రాంతం మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉంటోంది. అక్కడ భద్రతా దళాలు నిరంతరం గాలింపు చర్యలు జరుపుతుంటాయి. వారం రోజుల క్రితం కూడా ఈ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



మిడ్డే మీల్స్ కార్మికుల తొలగింపులు ఆపాలి

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం మారాక ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులను, ఆయాలను అకారణంగా రాజకీయ వేధింపులతో తొలగిస్తున్నారని, తక్షణం ఈ తొలగింపు ప్రక్రియను నిలిపివేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 200 మందిని ఇలాగే తొలగించారని తెలిపింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోయినా చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతూ మిడ్డే మీల్స్ పథకాన్ని అమలు చేస్తున్న వారిని అకారణంగా తొలగించి తెలుగుదేశం పార్టీకి చెందిన వారిని పెడుతున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో మిడ్డే మీల్స్ కార్మికులను పనులు చేసుకోనివ్వకుండా వంటపాత్రలను బయటకు విసిరేసి రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని రాజకీయ కక్షసాధింపు చర్యలను మిడ్డే మీల్స్ కార్మికులపై వేధింపులను ఆపాలని కోరారు.

ఇద్దరు బాలికలపై లైంగిక దాడి

ప్రజాశక్తి - నకరికల్లు (పల్నాడు జిల్లా)

ఇద్దరు బాలికలపై లైంగికదాడి జరిగిన సంఘటన పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సత్తెనపల్లి డిఎస్‌పి గురునాథబాబు వివరాల మేరకు.. ఉదయనగర్ తండాకు చెందిన బొజ్జ నాగమల్లేశ్వరరావు స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పది రోజుల అనంతరం మరో బాలికపైనా అదే విధమైన చర్యకు పాల్పడ్డాడు. బాలికల ప్రవర్తనలో తేడాలను గమనించిన తల్లిదండ్రులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. దీంతో బాధిత కుటుంబీకులు నకరికల్లు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు డిఎస్‌పి చెప్పారు.

వైసిపికి సిద్ధా రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపికి మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన రాజీనామా లేఖను పంపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సిద్ధా రాఘవరావు 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో మంత్రిగా పనిచేశారు. 2019లో ఒంగోలు పార్లమెంటు నుండి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆయన టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఇపుడు వైసిపికి రాజీనామా చేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా పోరాటాలు

- రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభ నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రానున్న కాలంలో రైతాంగ, రైతు కార్మికుల సమస్యలతో పాటు పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా పోరాటాలు నిర్వహించనున్నట్లు రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ తెలిపారు. మూడ్రోజులపాటు ఏలూరులోని టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభ సోమవారం ముగిసింది.

చివరి రోజు అధ్యక్షులుగా సింహాద్రి ఝాన్సీ, కార్యదర్శిగా డి వర్మతోపాటు 24 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఝాన్సీ మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యలను పరిష్కరించాలని, కనీస మద్దతు ధర చట్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వెనక్కు తీసుకోవాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి, గ్రామీణ వలసలు అరికట్టాలని, రైలుప్రమాద ఘటనలకు ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ఇతర ప్రజా సమస్యలపై 20 తీర్మానాలను మహాసభలో ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్మ, జిల్లా కార్యదర్శి భాషా పాల్గొన్నారు.

22న వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 22న జరగనుంది. తాడేపల్లిలోని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలతో సహా ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులందరికీ ఆహ్వానం పంపారు. గెలిచిన నలుగురు ఎంపిలు మినహా పార్లమెంటుకు పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులకు ఆహ్వానం పంపారు. వారం రోజుల క్రితం శాసనమండలి సభ్యులతోనూ ఆయన సమావేశమై వారికి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులతోనూ సమావేశమై పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కార్యాచరణపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కేవలం 11 సీట్లకే పరిమితం కావడంపై సుదీర్ఘ చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఓటమికి గల కారణాలపై చర్చించి, అధికార పార్టీని ఎలా ఎదుర్కోవాలో వారికి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

విద్యాకానుక కిట్ల లెక్కలు తేలుస్తారా?

- మిగులును పట్టించుకోకుండా భారీ కొనుగోళ్లు
- కోట్లాది రూపాయల అవినీతి?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న విద్యాకానుక కిట్లపై విద్యాశాఖ అధికారులు లెక్కలు తేలుస్తారో? లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. జగనన్న విద్యాకానుక(జెవికె) పేరుతో గత ప్రభుత్వం ప్రతి ఏటావిద్యార్థుల సంఖ్య కంటే అదనంగా కొనుగోలు చేసింది. దీనిపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ వచ్చే విద్యాసంవత్సరంలో ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఆ మరుసటి సంవత్సరం కూడా ఇదే తంతు చోటుచేసుకుంటోంది. ఫలితంగా కోట్లాది రూపాయల అవినీతి జరిగిఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రతి ఏటా మిగులుతున్న లక్షలాది కిట్లు ఏమవుతాయో తెలియని స్థితి నెలకొంది. 2022-23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 39,96,064 మంది. అయితే 'సమగ్రశిక్ష అభియాన్ '45,60,041 కిట్లను కొనుగోలు చేసింది. వీటిలో 5,63,977 కిటు మిగిలాయి. ఒక్కో కిట్టును సుమారు రూ.1900లతో ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిగిలిన వాటి విలువ రూ.107.20కోట్లు. వీటిని పట్టించుకోకుండా 2023-24 విద్యాసంవత్సరానికి 39,96,064 కిట్లను మళ్లీ కొనుగోలు చేశారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో 38.22లక్షలు చేరారని పాఠశాల విద్యాశాఖ తొలుత ప్రకటించింది. తుది లెక్క 36,54,539 గా తేలింది. అంటే 3,41,525 లక్షల కిట్లు మిగిలాయి.



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న కిట్లు (ఫైల్)

ఒక్కో కిట్టును రూ.2006లతో కొనుగోలు చేశారు.జ వీటి విలువ రూ.68.50 కోట్లు. ఈ మిగులిన వాటిని పట్టించుకోకుండా ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లోనూ 36.50లక్షల కిట్లకు మళ్లీ ఆర్డర్ పెట్టారు.˝తేడాది ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా ఒక్కో కిట్టును రూ.2006లతో కొనుగోలు చేసింది. 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో మొత్తంగా 9,05,502 కిట్లు మిగిలాయి. వీటి విలువ సుమారు రూ.175కోట్లు ఉంటుందని చెబుతున్నారు. ఇంత ఖర్చుతో కొనుగోలు చేస్తున్నా విద్యార్థులకు అందించే బ్యాగ్, బూట్లలో నాణ్యత ఉండటం లేదు. 2022-23లో మిగిలిన కొన్ని వస్తువులను 2023-24 విద్యాసంవత్సరంలో ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. 2022-23లో మిగులు యూనిఫాం క్లాత్‌ను కెజిబివి, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ విద్యార్థులకు అందించిన్నట్లు చూపిస్తోంది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో కొన్ని పాఠశాలలకే నాలుగో జత అందించడం జరిగింది. ఈ మిగులు లెక్కలపై కొత్త ప్రభుత్వం విచారణ జరిపిస్తుందో? లేదో చూడాల్సి ఉంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-బెళుగుప్ప (అనంతపురం)



ఎర్రిస్వామి (ఫైల్)

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలంలో సోమవారం చోటు చేసకుంది. పోలీసుల వివరాల మేరకు.. కాలువపల్లి గ్రామానికి చెందిన కురుబ ఎర్రిస్వామి (35)కి ఐదు ఎకరాల సొంత పొలం ఉంది. ఇందులో బోరుబావు కింద మిర్చి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసేవారు. గత మూడు సంవత్సరాలుగా వర్షాభావంతో పంటలు దక్కకపోవడంతో సాగు కోసం చేసిన రూ.20 లక్షల అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి, అప్పులు తీరే దారిలేక ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిరోముండనంతో వైసిపి మాజీ కార్పొరేటర్ నిరసన

ఎమ్మెల్యే బోండా రాజకీయ కక్షసాధింపుతో భవనాన్ని కూల్చివేయించారని ఆరోపణ

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తూ తన భవనాన్ని కూల్చివేయించారని మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ సోమవారం స్వయంగా శిరోముండనం చేయించుకొని నిరసన తెలిపారు. అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. నియోజకవర్గంలో బోండా గుండాగిరి చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 15న విజయవాడ పాయకాపురం ప్రకాష్ నగర్లో విజయవాడ-నూజివీడు రహదారిపై ఉన్న మాజీ కార్పొరేటర్, విఎంసిలో వైసిపి కో ఆప్షన్ సభ్యుడు జగదీష్‌కు చెందిన భవనాన్ని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించారనే పేరుతో నగర పాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. గత ఎన్నికల్లో వైసిపి తరపున ప్రచారం చేశాననే కోపంతోనే బోండా ఉమా అనుచరుల సమక్షంలో విఎంసి అధికారులు జెసిబిల సాయంతో తన భవనాన్ని కూల్చివేశారని జగదీష్ ఆరోపిస్తూ కూల్చేసిన భవనం ముందు సోమవారం శిరోముండనం చేయించుకున్నారు. మీసాలు కూడా తీయించుకుని, చేతులు కట్టేసుకుని అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. తన భార్యకు సైతం



నిరసన తెలుపుతున్న వైసిపి మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్

శిరోముండనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. గతంలో తాను టిడిపిలో ఉన్నప్పుడు ఈ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే బోండా ఉమామహస్రశ్వరరావే ప్రారంభించారని తెలిపారు. దళిత నాయకుడినైన తాను ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి తరపున ప్రచారం చేశాననే అసూయతోనే తన భవనాన్ని ఎమ్మెల్యే కూల్చివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించే స్పందనలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తనకు న్యాయం చేయకపోతే తన కుటుంబ సభ్యులంతా శిరోముండనం చేయించుకుని నిరసనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

జిఒ 596ను రద్దు చేయాలని కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

తక్షణమే జిఒ 596ను రద్దు చేసి దళితుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖలోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ.. దళితుల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. దళిత, గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని విజ్ఞప్తి చేశారు. దళితులకు చెందిన 28 పథకాలను గత ప్రభుత్వం నిలిపివేసిందని, వాటిని కొత్త ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఆ నిధులను జనరల్ పథకాలకు గతంలో మళ్లించి దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు. దళితులకు విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం వంటివి అమలు చేయాలని, కులాంతర వివాహాలకు ప్రోత్సాహం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, కె.శేఖర్, కె.నర్సింగరావు, ఇమాన్యుయల్, సరోజిని పాల్గొన్నారు.

జగన్‌కు భద్రత కుదింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయన నివాసానికి భద్రతను కుదించారు. జగన్ సిఎంగా వున్నప్పుడు అడిషనల్ ఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో జడ్‌ప్లస్ కేటగిరి కింద మొత్తం 120 మంది పోలీసుల రక్షణ వుండేది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి ఓటమిపాలవడంతో జగన్‌కు భద్రతను కుదించారు. ప్రస్తుతం డిఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో 57 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దీంతో జగన్ సోమవారం నుంచి 30 మంది ప్రైవేటు సెక్యూరిటీని తన ఇంటి వద్ద రక్షణగా పెట్టుకున్నారు. గతంలో సీతానగరం నుంచి రేవేంద్రపాడు వరకు వున్న ఈ రోడ్డును జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక కరకట్ట వెంట దాదాపు కిలోమీటరు వరకు వున్న అమరారెడ్డి నగర్‌లో ఫోర్‌లైన్ రోడ్డు వేయించి ప్రజల రాకపోకలపై నియంత్రణ పెట్టిన విషయం తెలిసిందే. అయితే ప్రజలు రాకపోకలు సాగించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రైలు ప్రమాదం బాధాకరం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పశ్చిమ బెంగాల్‌లోని న్యూజల్పాయిగిరి ప్రాంతంలో చోటుచేసుకున్న రైలు ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంచనజంగ రైలును గూడ్స్ ఢీకొట్టిన ప్రమాదంలో చాలా మంది మరణించడం బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని రైల్వే మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదాల నివారణకు ఉద్దేశించిన కవచ్ సాంకేతికతను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదానికి తావులేని ప్రయాణాన్ని ప్రజలకు అందించాలని పవన్‌కల్యాణ్ కోరారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సోనియా, రాహుల్‌ను కలిసిన షర్మిల

- రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఎపిసిసి అధ్యక్షులు షర్మిల కలిశారు.

సోమవారం నాడిక్కడ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ తదుపరి కార్యాచరణకు సంబంధించి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలు, తదుపరి కార్యాచరణ, వీటన్నింటిపై ఎంతో నిర్మాణాత్మకమైన చర్చ జరిగింది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తిరిగి పునః వైభవం సంపాదించుకోవడం మాత్రమే కాదు, ఒక బలమైన శక్తిగా అవతరించడంలో మరిన్ని అడుగులు పడనున్నాయని తెలియజేస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నానని షర్మిల అన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై తీసుకునే నిర్ణయాలపై చర్చించినట్లు తెలిపారు.

శివారుకు సాగునీరు కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవహించే పరిస్థితే కనిపించట్లేదు.

కానరాని క్లోజర్ పనులు

రాష్ట్ర ప్రభుత్వం క్లోజర్ పనులకు మంగళం పలికింది. గోదావరి డెల్టా కింద ఉభయగోదావరి జిల్లాల్లో పది లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వల ద్వారా సాగు నీరు సరఫరా అవుతుంది. తూర్పు డెల్టాలో 268.6 కిలోమీటర్లు, మధ్య డెల్టాలో 226.83 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువలు ఉన్నాయి. కాలువల్లో పూడికతీత పనులకు ఎన్నికల కోడ్‌కు ముందుగానే జనవరిలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. తూర్పు, మధ్య డెల్టాల్లో 430 పనులకు సంబంధించి రూ.31.54 కోట్లు అవసరమని, ఈ పనులకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కానీ, ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడా ప్రారంభం కాలేదు. పూడికతీత కోసం 2022-23లో రూ.63 కోట్లు, 2023-24లో రూ.12 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అయినా, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో, ఈ ఏడాది టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు.

ఏటా ముంపే...

కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షాలు పడితే పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కాలువలు మట్టి, గుర్రపు డెక్కతో పూడికపోవడంతో నీటి ప్రవాహం జరగట్లేదు. పొలాల్లోని వర్షపు నీరు పోయే మార్గం లేక పంటలు మునిగిపోతున్నాయి. పూడికతీత జరగకపోవడంతో గతేడాది ఖరీఫ్‌లో తుపానుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని తాళ్లరేవు, ముమ్మిడివరం, రాజోలు, రామచంద్రపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అమలాపురం రూరల్ మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

ఈ ఏడాది పూడికతీత పనులు లేవు

గతంలో కొంతమేర అయినా పూడికతీత పనులు జరిగేవి. ఈ ఏడాది పనులు మొదలు పెట్టలేదు. కాలువలకు నీటిని విడుదల చేసినా పూడికతీత పనులు జరగకపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు అందడం కష్టమే.

- వై.వెంకటేశ్వరరావు, రైతు, జేగురుపాడు

ప్రతిపాదనలు పంపించాం

పూడికతీత, క్లోజర్ పనులకు రూ.31.54 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఏడాది జనవరిలోనే ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

- కాశీ విశ్వేశ్వరరావు, ఇఇ, ఇరిగేషన్ శాఖ

ఇక సూపర్-8 సమరం

- 19న అమెరికా, దక్షిణాఫ్రికా మ్యాచ్‌తో ప్రారంభం



గయానా: ఐసిసి టి20 ప్రపంచకప్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సూపర్-8 బెర్తులు ఖరారయ్యాయి. 20జట్లతో ఈసారి ప్రారంభమైన మెగా టోర్నీలో లీగ్ దశలోనే బలమైన మూడుజట్లు నిష్క్రమించాయి. గ్రూప్-ఎ నుంచి పాకిస్తాన్, సి నుంచి న్యూజిలాండ్, డి నుంచి శ్రీలంక జట్లు సూపర్-8కు చేరడంలో విఫలమయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ జట్టు గ్రూప్-బి నుంచి చివరి మ్యాచ్‌లో నమీబియాపై గెలిచి సూపర్-8కు చేరగా.. స్కాట్లాండ్ రన్‌రేట్ ప్రాతిపదికపై సూపర్-8కు చేరడంలో విఫలమైంది. గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు ముగిసిన అనంతరం ఇంగ్లండ్, స్కాట్లాండ్ జట్లు 5పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. శ్రీలంక జట్టు 2014 ఛాంపియన్ కాగా.. పాకిస్తాన్ 2009 ఛాంపియన్. ఈ రెండు జట్లు ఈసారి లీగ్ దశలోనే నిష్క్రమించడం అభిమానులను తీవ్ర మానసిక క్షోభకు గురి చేసింది.

అమెరికా, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్ సంచలనాలు..

టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించిన జట్లలో ఆతిథ్య అమెరికా జట్టు పెను సంచలనాన్ని నమోదు చేసింది. ఈ జట్టు మెగా టోర్నీకి అర్హత సాధించడమే గొప్ప అనుకుంటే.. ఏకంగా పాకిస్తాన్ వంటి దిగ్గజ జట్టును తొలి మ్యాచ్‌లోనూ ఓడించి సంచలనాన్ని తెరలేపింది. ఇక గ్రూప్ ఆఫ్ డెత్‌గా ఉన్న గ్రూప్-సిలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు అంచనాలకు మించి రాణించింది. 2019 వన్డే ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌ను ఓడించి సూపర్-8 బెర్త్ దక్కించుకొంది. అదే క్రమంలో ఈ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి టాపర్‌గా సూపర్-8కు చేరడం చెప్పుకోగదగ్గ విషయం. ఆతిథ్య వెస్టిండీస్ జట్టు 2వ స్థానంలో నిలిచి సూపర్-8కు చేరినా.. న్యూజిలాండ్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఇక గ్రూప్-డిలో శ్రీలంక జట్టును బంగ్లాదేశ్ ఓడించింది. ఈ ఫలితం శ్రీలంకకు శరాఘా తంగా తయారైంది. దీంతో ఆ జట్టు లీగ్‌దశను దాటలేక పోయింది. ఈ టోర్నీలో ముందుకు వెళ్లలేకపోయినా పాపువా న్యూగినీ, నేపాల్ జట్లు కూడా తక్కువేం కాదు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా లాంటి బలమైన జట్టు చేతిలో నేపాల్ ఒకే ఒక్క పరుగు తేడాతో ఓడి తన సత్తా ఏంటో చాటింది. మున్ముందు టోర్నీల్లో ఈ కూనలతో పెద్ద జట్లు జాగ్రత్తగా ఉండక తప్పదు అని ఈ టీ20 ప్రపంచకప్ ద్వారా నిరూపితమైంది.ఈ టి20 ప్రపంచకప్‌లో ఆఫ్ఘాన్ చేతిలో కివీస్ 84 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ టోర్నీలోనే పెద్ద సంచలనం ఇదే.

గ్రూప్-1 : ఇండియా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్
గ్రూప్-2 : అమెరికా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్

సూపర్-8 షెడ్యూల్...

తేదీ	ఎవరెవరికి..	వేదిక	సమయం
19(బుధ)	అమెరికా × దక్షిణాఫ్రికా	ఆంటిగ్వా	రా.8.00గం॥లకు
20(గురు)	ఇంగ్లండ్ × వెస్టిండీస్	సెయింట్‌లూసియా	ఉ.6.00గం॥లకు
	ఆఫ్ఘనిస్తాన్ × ఇండియా	బార్బొడాస్	రా.8.00గం॥లకు
21(శుక్ర)	ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్	ఆంటిగ్వా	ఉ.6.00గం॥లకు
	ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా	సెయింట్‌లూసియా	రా.8.00గం॥లకు
22(శని)	అమెరికా × వెస్టిండీస్	బార్బొడాస్	ఉ.6.00గం॥లకు
	ఇండియా × బంగ్లాదేశ్	ఆంటిగ్వా	రా.8.00గం॥లకు
23(ఆది)	ఆఫ్ఘనిస్తాన్ × ఆస్ట్రేలియా	కింగ్స్‌టౌన్	ఉ.6.00గం॥లకు
	అమెరికా × ఇంగ్లండ్	బార్బొడాస్	రా.8.00గం॥లకు
24(సోమ)	వెస్టిండీస్ × దక్షిణాఫ్రికా	ఆంటిగ్వా	ఉ.6.00గం॥లకు
	ఆస్ట్రేలియా × ఇండియా	సెయింట్‌లూసియా	రా.8.00గం॥లకు
25(మంగళ)	ఆఫ్ఘనిస్తాన్ × బంగ్లాదేశ్	కింగ్స్‌టౌన్	ఉ.6.00గం॥లకు
27(బుధ)	సెమీఫైనల్-1	ట్రినిడాడ్	ఉ.6.00గం॥లకు
	సెమీఫైనల్-2	గయానా	రా.8.00గం॥లకు
29(శని)	ఫైనల్	బార్బొడాస్	రా.7.30గం॥లకు

సుమిత్ కెరీర్ బెస్ట్

ఎటిపి ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి చేరిక



ముంబయి: భారత టెన్నిస్ యువకెరటం సుమిత్ నగాల్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఇటీవలే పెరూగియా ఎటిపి చాలెంజర్స్‌లో రన్నరప్‌గా నిలిచిన అతడు.. తాజా ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి చేరాడు. ఇంతకుముందు పురుషుల సింగిల్స్‌లో 77వ ర్యాంక్‌తో రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సంచలన విజయాలతో రాణిస్తున్న నాగల్.. పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా బెర్త్ దక్కించుకున్నాడు. దీంతో గత ఐదేళ్లలో ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నగాల్ చరిత్ర సృష్టించాడు. నగాల్ కంటే ముందు ప్రజ్నేష్ గున్నేశ్వరన్ 2019లో వింబుల్డన్ టోర్నీకి నేరుగా అర్హత సాధించాడు. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించడమే కాకుండా రెండో రౌండ్‌కు దూసుకెళ్లి రికార్డులు నెలకొల్పాడు. ఫిబ్రవరిలో చెన్నై ఓపెన్ విజేతగా అవతరించిన నగాల్.. అనంతరం జర్మనీలో హీల్‌బ్రాన్ నెక్కర్‌కప్ ట్రోఫీని కైవసం చేసుకున్నాడు.

అంకితకు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: మహిళా ఆర్చర్ అంకిత భకత్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం రాత్రి జరిగిన 2024 ఒలింపిక్స్ ఆర్చరీ క్వాలిఫ యర్స్ ఫైనల్లో అంకిత వ్యక్తిగత రికర్వు విభాగంలో ఒలింపిక్ బెర్త్ దక్కించుకుంది. ఒలింపిక్ బెర్త్ దక్కించుకొనే క్రమంలో అంకిత జాతీయ రికార్డును తిరగరాసింది. 9వ సీడ్‌గా బరిలోకి దిగిన అంకితకు తొలిరౌండ్‌లో బై లభించింది. రెండో రౌండ్‌లో 6-4తో, మూడో రౌండ్‌లో 7-3తో విజయాలు సాధించిన అంకిత.. నిర్ణయాత్మక ఒలింపిక్ బెర్త్ పోటీలో 6-0తో ఫిలిప్పీన్స్‌కు చెందిన గాబ్రియేల్ మోనికాను చిత్తుచేసి పారిస్ బెర్త్‌ను సాధించింది. ఇక 2వ సీడ్ దీపిక కుమారికి తొలి, రెండోరౌండ్‌లలో బై లభించగా.. మూడోరౌండ్‌లో 4-6తో అజర్‌బైజాన్‌కు చెందిన యైరగుల్ చేతిలో ఓటమిపాలై ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది.

యూరో కప్‌లో ఇంగ్లండ్ చరిత్ర

ఐదు సీజన్లలోనూ తొలి మ్యాచ్‌లో గెలుపుతో అరుదైన రికార్డు

బెర్లిన్: జర్మనీ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక యూరో చాంపియన్‌షిప్‌లో మరో సంచలనం నమోదైంది. తొలి నాలుగు మ్యాచుల్లోనే 16 గోల్స్‌తో 48ఏళ్ల రికార్డు బద్ధలైన చోట.. హ్యారీ కేన్ సారథ్యంలోని ఇంగ్లండ్ చరిత్ర సృష్టించింది. వరుసగా ఐదు విజయాలతో టోర్నీలో కొత్త అధ్యాయం లిఖించింది. సోమవారం సెర్బియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, 2020 నుంచి యూరో చాంపియన్‌షిప్ నాలుగు సీజన్లలో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుగా ఇంగ్లండ్ జట్టు రికార్డు నెలకొల్పింది. తద్వారా యూరో చాంపియన్‌షిప్ చరిత్రలోనే వరుసగా ఐదు విజయాలు సాధించిన తొలి జట్టుగా కొత్త చరిత్రను లిఖించింది. ఇంగ్లండ్ జట్టు 2020 ఎడిషన్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెక్ పెట్టింది. ఆ తర్వాతి సీజన్లలో వరుసగా స్కాట్లాండ్, క్రొయేషియా, స్లొవేకియాలను చిత్తు చేసింది. తాజాగా ఎడిషన్‌లో ఇంగ్లండ్ బలమైన సెర్బియాను మట్టికరిపించి చరిత్రలోనే అరుదైన రికార్డు ఖాతాలో వేసుకుంది.

రాష్ట్రపతి, గవర్నర్ల విడిది కోసమే నిర్మించాం : అమర్‌నాథ్

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

రాష్ట్ర ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ నగరానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు వచ్చినప్పుడు వారికి సరైన విడిది సౌకర్యం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకునే సదరు రుషికొండపై భవనాలను నిర్మించామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వీటిని విఐపిలు, వివిఐపిలకు కేటాయించే అవకాశం ఉన్నందున భద్రతను దృష్టిలో పెట్టుకునే ఇప్పటివరకూ బహిర్గతం చేయలేదని తెలిపారు.

జిఓలు ఎక్కడ?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఇంకా రహస్యంగానే ఉంటున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఈ నిర్ణయాలు బహిరంగం చేయాల్సి ఉన్నప్పటికీ ఇంకా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీనికోసం ఉన్న జిఓఐఆర్ వెబ్‌సైట్‌ను గత ప్రభుత్వంలో మూసివేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గత 2019 నుంచి ఈ సైట్‌ను నిలిపేశారు. అయితే అనేకమంది దీనిపై న్యాయస్థానాలను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీనిపై టిడిపి కూడా తీవ్రంగానే ధ్వజమెత్తింది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఇంకా ఆ సైట్‌పై మాత్రం నిర్ణయం తీసుకోలేదు. అటు జిఓఐఆర్ పనిచేయక, ఇటు గెజిట్ సైట్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో నిర్ణయాలు ఇంకా రహస్యంగానే ఉండిపోతున్నాయి.

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు ఛాంబర్ రెడీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు సచివాలయంలో ఛాంబర్ రెడీ అయ్యింది. ఆయనకు రెండో బ్లాక్ మొదటి అంతస్తు 212 గదిని ప్రభుత్వం కేటాయించింది. అదే అంతస్తులో జనసేనకు చెందిన పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు, సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు కూడా ఛాంబర్లు కేటాయించారు. ఈ నెల 19న పవన్‌కల్యాణ్ డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించనున్న సంగతి తెలిసిందే.



గుర్తు తెలియని వాహనం ఢీకొని నెమలి మృతి

ప్రజాశక్తి - అనంతపురం క్రైం

గుర్తు తెలియని వాహనం ఢీకొని నెమలి మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలోని నేషనల్ పార్క్ హైవే రోడ్డుపై సోమవారం ఉదయం చోటు చేసుకుంది. త్రీ టౌన్ ఎస్ఐ గోపాలుడు తెలిపిన వివరాల మేరకు.. ఆహారం కోసం నేషనల్ పార్క్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నడంతో ఓ నెమలి మృత్యువాత పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నెమలి మృతదేహాన్ని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు అప్పగించారు.

అనుమతి లేకుండా ఎలా వెళ్లారు?

- కెవివి అంశంపై ప్రభుత్వం ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉంటూ అనుమతి లేకుండా కేంద్రానికి వెళ్లిపోయిన కెవివి సత్యనారాయణపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. డిప్యూటేషన్లపై రాష్ట్రంలో పనిచేస్తున్న వారిని రిలీవ్ చేసేందుకు అనుమతి ఇవ్వొద్దని నేరుగా గవర్నరు ఆదేశించినప్పటికీ, సత్యనారాయణ ఎలా కేంద్రానికి వెళ్లిపోయారన్నదానిపై విచారణ నిర్వహించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కేంద్రంలోని రైల్వే సర్వీస్ కేడర్‌కు చెందిన ఆయన సుదీర్ఘకాలంగా రాష్ట్ర ఆర్థికశాఖలో పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన డిప్యూటేషన్ కాలపరిమితి పూర్తికాగా పొడిగింపుతో ఇక్కడే పనిచేస్తున్నారు. ఈ పొడిగింపు కూడా మంగళవారంతో పూర్తికానుంది. అయితే ఆయన ముందుగానే రాష్ట్రం విడిచి వెళ్లిపోవడం ఎలా సాధ్యమైంది, ఎవరు సహకరించారన్న కోణంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే నిబంధనల మేరకు ఆయనను తిరిగి వెనుకకు రప్పించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

రోజుకొక సమస్య

- నిన్న విమల పాఠశాల మూసివేత
- నేడు గురజాడ కళాక్షేత్రం ఛార్జీలు పెంపు
- స్టీల్ యాజమాన్యంపై కార్మికుల్లో ఆగ్రహం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రోజుకొక సమస్యను సృష్టిస్తోంది. ప్లాంట్‌ను ఎలాగైనా ప్రయివేటీకరించాలన్న ధృడనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి ప్లాంట్ యాజమాన్యం సహకరిస్తూ వస్తోంది. ఆ కుట్రలో భాగంగానే ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, క్వార్టర్‌లో విద్యుత్ ఛార్జీలు పెంచడం, విమల పాఠశాలను మూసివేయడం వంటి కుట్రలకు తెరలేపింది. ఉక్కు ఉత్పత్తిపై కార్మికులు, ఉద్యోగులు శ్రద్ధ పెట్టనీయకుండా చేస్తోంది. ఈ సమస్యలపైనా కార్మికులు పోరాటాలు, ఆందోళనలు చేస్తూ ప్లాంట్‌ను రక్షించుకుంటూ వస్తున్నారు.

కొద్ది నెలలుగా ఉక్కు కర్మాగారం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేదు. గత నెలలో అయితే 20 రోజుల ఆలస్యంగా చెల్లించారు. గతంలో కేంద్రీయ విద్యాలయాన్ని, తాజాగా విశాఖ విమల విద్యాలయాన్ని మూసివేసేందుకు స్టీల్ యాజమాన్యం ప్రయత్నించింది. కార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన బాట పట్టి వాటిని రక్షించుకోగలిగారు. స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో ఇప్పటి వరకూ యూనిట్ విద్యుత్‌కు 50 పైసలు చెల్లిస్తుండగా దాన్ని రూ. ఎనిమిదికు పెంచుతూ నిర్ణయం చేసిన సంగతి తెలిసిందే.

గురజాడ కళాక్షేత్రం ఛార్జీల బాదుడు

ఉక్కునగరంలో ఏ శుభకార్యమైనా, కార్మిక సంఘాల సమావేశాలు, సభలు, ఇతరత్రా ఫంక్షన్‌లైనా గురజాడ కళాక్షేత్రంలోనే నిర్వహించుకుంటూ వస్తున్నారు. ఆ కళాక్షేత్రం ఛార్జీలను పెంచుతూ ఈ నెల 14న సర్క్యులర్‌ను ఉక్కు యాజమాన్యం జారీచేసింది. ఆ ప్రకారం.. పెళ్లిళ్లు, రిసెప్షన్లకైతే (ఉద్యోగులు, వారిపై ఆధారపడేవారికి) రూ.20 వేలు తీసుకుంటున్నారు. ఇతర కార్యక్రమాలకు రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. ఎసి ఛార్జీల కింద రూ.1800 చెల్లించాల్సి ఉంది. జిఎస్‌టి కూడా కట్టాలి. ఉక్కు ఉద్యోగులు కాకుండా బయట వ్యక్తులైతే రోజుకు రూ.75000, జిఎస్‌టి చెల్లించాలి. వీరికి ఎసి ఛార్జీలు రూ.3600, జిఎస్‌టి ఉంటాయి. కమర్షియల్ కోసం ఎవరైనా వినియోగిస్తే లక్షా యాభై వేలు చెల్లించాలి. దీనికి ఎసి ఛార్జీలు రూ.3600, జిఎస్‌టి చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఉద్యోగికి రూ.1600 నామమాత్రపు ఫీజు ఉండగా నేడు రూ.20 వేలకు పెంచేశారు. బయట వ్యక్తులకు రూ.30 వేలు ఉండగా నేడు రూ.75 వేలుకు పెంచేశారు. తాజా నిర్ణయంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఉక్కు కర్మాగారంపై దృష్టిపెట్టి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలని కోరుతున్నారు.

వంద రోజుల్లో గంజాయిని అరికట్టాలి

- పోలీసులకు లోకేష్ ఆదేశాలు జారీ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)



మంగళగిరిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

రాష్ట్రంలో వందరోజుల్లో గంజాయిని అరికట్టాలని రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ పోలీసులకు ఆదేశించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గుంటూరు జిల్లా ఈద్గాలో ముస్లిముల ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హోం మంత్రి అనిత, టిడిపి పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పోలీసు ఉన్నత అధికారులకు గంజాయిపై వివరించామని తెలిపారు. తనను గెలిపించిన మంగళగిరి ప్రజలకు సేవ చేసేందుకు కష్టి చేస్తున్నామన్నారు. హామీ ఇచ్చిన ప్రతి కార్యక్రమం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుంటానని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నేతలే టిడిపి నేతలపై దాడులకు పాల్పడుతున్నారని, హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఓర్పుగా ఉండమన్నారనే విషయం గుర్తుంచుకుని తాము దాడులకు దిగలేదన్నారు. అయినా, తమపై వైసిపి నాయకులు ఎలా ఆరోపణలు చేస్తారంటూ ప్రశ్నించారు. శాంతిభద్రతలకు భంగం కలగకూడదనే శాంతియుతంగా ఉన్నామన్నారు. గెలిచి కేవలం పది రోజులు మాత్రమే అయిందని, పదేళ్ల పాటు ఎమ్మెల్యేలుగా ఉన్నవాళ్లు ఏం చేశారో చెప్పాలన్నారు. వైజాగ్ రుషికొండ వ్యవహారంపై ముఖ్యమంత్రి నివేదిక సమర్పించాలని అధికారులను కోరామన్నారు. రుషికొండ లాంటివి రాష్ట్రంలో చాలానే జరిగాయని, అన్నిటి మీద నివేదిక వచ్చిన అనంతరం ప్రజల ముందు బహిర్గతం చేస్తామని చెప్పారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలకు త్వరలో పరిష్కారం

- ఆశ్రమ పాఠశాలల్లో 544 మంది ఎఎన్‌ఎంల నియామకం
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, గత ఐదేళ్లలో గిరిజనులు ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంత్రిగా ఆమె సచివాలయంలోని మూడో బ్లాక్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 544 ఎఎన్‌ఎంలను నియమించే ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గర్భిణులు, చిన్నారులు, గిరిజనులతో సహా ఏ ఒక్కరూ పౌష్టికాహార లోపంతో చనిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో ఎవరైనా అనారోగ్యానికి పాల్పడితే వారిని భుజాలపైనా, డోలీలపైనా మోసుకుని రావడం నిత్యం మీడియాలో చూస్తున్నామన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి లేకుండా ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. ఐటిడిఎ, ఐసిడిఎస్ ప్రాజెక్టులను పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, పౌష్టికాహారం లోప నివారణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ జెవి మురళి, గురుకుల సొసైటీ కార్యదర్శి సదా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రుయాలో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని రుయా వైద్యాధికారులకు రాష్ట్ర వైద్యశాఖ మంత్రి వై సతీష్ కుమార్ సూచించారు. మొట్టమొదటిసారి మంత్రిగా వేంకటేశ్వర స్వామిని దర్శించకోడానికి ఆదివారం కుటుంబ సమేతంగా ఆయన ఆదివారం విచ్చేశారు. శ్రీవారి దర్శనానంతరం సోమవారం రుయా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి లోపల అత్యవసర విభాగ వార్డులో వైద్య చికిత్స కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులను అక్కడ అందుతున్న వైద్యం గురించి, వైద్యుల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపి విభాగానికి వెళ్లి ఓపి చీటీలు పొందే దగ్గర ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇన్‌పేషంట్, రోగి సహాయకులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందుతోందని, మందులు అందుబాటులో ఉన్నాయని రోగులు చెప్పారు. ఎండాకాలంలో కొద్దిపాటి నీటి సమస్య ఉందని, ప్రయివేట్ ఆస్పత్రుల కన్నా మెరుగ్గా వైద్యం అందుతుందని తెలిపారు. రేడియాలజీ డిపార్టుమెంట్‌ను మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైద్య విద్య ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరిలతో రుయా ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టిడిపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సుగుణమ్మ, నరసింహయాదవ్ పాల్గొన్నారు.

జిందాల్ పరిశ్రమను తెరిపించండి

మంత్రి శ్రీనివాస్‌ను కోరిన కార్మికులు

ప్రజాశక్తి- కొత్తవలస (విజయనగరం జిల్లా)



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమను తెరిపించేందుకు కృషి చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆ పరిశ్రమ కార్మికులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌ను జిందాల్ కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. యాజమాన్యం అక్రమంగా లాకౌట్ విధించడం వల్ల తామంతా రోడ్డున పడ్డామని తెలిపారు. లాకౌట్ ఎత్తివేసి, ఆ కాలానికి జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని, మరిన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పిదాల వలన ఇటువంటి పొరపాట్లు మరెన్నో జరిగాయని, వాటన్నింటికీ పరిష్కార మార్గం కనుగొంటామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సిఐటియు నాయకుడు నమ్మి చినబాబు, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు సలాద్ భీమయ్య తదితరులు ఉన్నారు.

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించండి

కొత్తవలస మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని మంత్రి శ్రీనివాస్‌ను లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ కోరారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమల గురించి మంత్రికి వివరించారు. పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

తాడిపత్రిలో టిడిపి కార్యకర్త దారుణహత్య

ప్రజాశక్తి-తాడిపత్రి (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఆదివారం రాత్రి ఓ టిడిపి కార్యకర్త సోమవారం దారుణహత్యకు గురయ్యారు. ఈ ఘటనతో ఒక్కసారిగా తాడిపత్రిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తాడిపత్రి పట్టణం నందలపాడుకు చెందిన లాల్‌బాషా అలియాస్ లాలు (30) టిడిపి కార్యకర్తగా ఉన్నారు. ఆదివారం రాత్రి ఇంటిపై నిద్రిస్తున్న ఆయనను గుర్తుతెలియని వ్యక్తులు చాకుతో గొంతు కోసి హత్య చేశారు. సోమవారం ఉదయం లాలు తల్లి నిద్ర లేపడానికి వెళ్లి చూడగా ఆయన రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నారు. డిఎస్‌పి జనార్ధన్ నాయుడు, పట్టణ సిఐ నాగేంద్రప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. లాల్‌బాషాపై గతంలో పలు పోలీసు కేసులు ఉన్నాయని డిఎస్‌పి తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ఘర్షణల కారణంగానే ప్రత్యర్థులు హత్యకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

రుణాల జారీలో 15% వృద్ధి

- ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖరా అంచనా



ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రుణాల జారీలో 14-15 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ దినేష్ కుమార్ ఖరా అన్నారు. "సాధారణంగా మనం జిడిపి వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం, దాని కంటే 2-3 శాతం అదనంతో కలుపుకుంటే 14 శాతం లేదా అంతకంటే ఎక్కువ సంఖ్య ఉంటుంది. ఈ నేపథ్యంలోనే 14-15 శాతం రుణాల్లో వృద్ధి అందుబాటులో ఉన్న అవకాశాలను సూచిస్తుంది. ఇది మా అవసరాలను తీర్చనుంది. ఈ స్థాయి వృద్ధి సంతోషాన్ని ఇస్తుంది." అని దినేష్ ఖరా తెలిపారు. డిపాజిట్ల విషయానికొస్తే గతేడాది 11 శాతం వృద్ధిని సాధించామన్నారు. డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాలని తమపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. తమ వద్ద రూ.3.5 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు అదనపు చట్టబద్ధమైన ద్రవ్య నిష్పత్తి (ఎస్‌ఎల్‌ఆర్)ను కలిగి ఉన్నామన్నారు.

"మేము ఎల్లప్పుడూ డిపాజిట్లకు ప్రాధాన్యతనిస్తాము. అందుకే మేము ఇటీవల స్వల్పకాలిక డిపాజిట్ల కోసం వడ్డీ రేటును పెంచాము. ఎందుకంటే మెరుగుదల కోసం అవకాశాలు ఉన్నాయని మేము భావించాము. మేము మా డిపాజిట్ వృద్ధి రేటును కొంతవరకు మెరుగుపర్చుకోవాలి. ఈ సంవత్సరంలో మేము కనీసం 12-13 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం." అని దినేష్ ఖరా తెలిపారు. ఎంపిక చేసిన డిపాజిట్లపై గత నెల ఎస్‌బిఐ వడ్డీ రేట్లను 75 బేసిస్ పాయింట్లు మేర పెంచింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఎం) గతేడాది స్థాయిలోనే 2-3 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని దినేష్ ఖరా అన్నారు. ఎస్‌బిఐ మొండి బాకీల విషయానికి వస్తే.. నికర, స్థూల నిరర్థక ఆస్తుల్లోనూ తగ్గుదల కొనసాగుతోందన్నారు. అయినప్పటికీ.. సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ పనితీరును అంచనా వేయలేము కాబట్టి.. ఎన్‌పిఎల భవిష్యత్తును అంచనా వేయలేమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఎస్‌బిఐ స్థూల నిరర్థక ఆస్తులు 54 బేసిస్ పాయింట్లు మెరుగై.. 2.24 శాతానికి, నికర ఎన్‌పిఎలు 10 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 0.57 శాతానికి పరిమితమయ్యాయి.

20 నుంచి ఒప్పో ఎఫ్27 ప్రో విక్రయాలు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో కొత్తగా ఒప్పో ఎఫ్27 ప్రో ప్లస్ 5జిని ఆవిష్కరించింది. వీటి అమ్మకాలను జూన్ 20 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం ప్రీఆర్డర్లను స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. 6.7 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఆక్టా కోర్ మీడియా టెక్ 7050 ఎస్ఒసితో ఆవిష్కరించింది. 8జిబి ర్యామ్, 128జిబి లేదా 256 జిబి సహా 64 ఎంపి ప్రధాన కెమెరా, 2ఎంపి డెప్త్ కెమెరా, 8ఎంపి సెల్ఫీ కెమెరాతో విడుదల చేసింది. 128 జిబి వేరియంట్ ధరను రూ.27,999గా, 256జిబి ధరను రూ.29,999గా నిర్ణయించింది.

పసిడి దిగుమతుల్లో 210% పెరుగుదల

- యుఎఇతో ఎఫ్‌టిఎ ఫలితం

న్యూఢిల్లీ : యుఎఇతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)తో ఆ దేశం నుంచి భారీగా పసిడి, వెండి దిగుమతులు పెరిగాయి. గడిచిన 2023-24లో బంగారం, వెండి దిగుమతులు 210 శాతం ఎగిసి 3.5 బిలియన్ డాలర్ల నుంచి 10.7 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో రాయితీ కస్టమ్స్ సుంకం రేట్లను సవరించాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్సియేటివ్ (జిటిఆర్ఐ) ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. భారత్ తన వాణిజ్య విధానాలను సమతుల్యం చేసుకోవడానికి, దేశీయ ఆదాయాన్ని కాపాడుకోవడానికి, విలువైన లోహాలు, ఆభరణాల దిగుమతిలో న్యాయమైన పోటీని నిర్ధారించడానికి ప్రభుత్వం కొన్ని చర్యలను అమలు చేయాలని జిటిఆర్ఐ ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవా పేర్కొన్నారు.

కెబిసి గ్లోబల్‌కు సిఆర్‌జెఇ కాంట్రాక్టు

KARDA CONSTRUCTIONS BUILDERS & DEVELOPERS (KBC GLOBAL LTD)

హైదరాబాద్ : కెబిసి గ్లోబల్ లిమిటెడ్ (ఇంతక్రితం కర్దా కన్‌స్ట్రక్షన్)కు సిఆర్‌జెఇ లిమిటెడ్ నుంచి సాఫ్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి సంబంధించిన 20 మిలియన్ డాలర్ల (రూ.167 కోట్లు) విలువ చేసే సబ్ కాంట్రాక్ట్ దక్కినట్లు ఆ సంస్థ తెలిపింది. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలోని సిఆర్‌జెఇ ఆఫ్రికాలో రైల్వేలు, ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మిస్తోంది. కెబిసి గ్లోబల్‌కు చెందిన కెన్యా అనుబంధ సంస్థ కర్దా ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ద్వారా ఒప్పందం చేసుకోవడం ద్వారా ఆఫ్రికా మార్కెట్‌లో విస్తరణకు వీలు కలిగిందని కెబిసి గ్లోబల్ పేర్కొంది.

సంపాదకీయం

నీట్‌గా స్కాం

దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుంది. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారు. ఎన్‌టిఎను మెరుగు పర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారు. అంతేతప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామనికాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదు. నీట్‌లో అక్రమాలు అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారుతప్ప కించిత్తు పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదు. మంత్రి నుంచి ఇన్నాళ్లకు వెలువడిన పేలవమైన స్పందనబట్టి నీట్ స్కాంను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు తయారుగా ఉందని అర్థమవుతుంది.

నీట్‌లో అవకతవకలే జరగలేదని కేంద్రం చెబుతూ వచ్చింది. బిజెపి ఏలుబడిలోని గుజరాత్‌లో అవకతకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయింది. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల, ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ కూడా చేశారు. మరోవైపు ఎన్‌డిఎ పాలనలోని బీహార్‌లో ప్రత్యేకంగా సిట్‌ను వేసి దర్యాప్తు చేయిస్తున్నారు. ఇప్పటికి 13 మందిని అరెస్ట్ చేశారు. వారిలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారూ ఉన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే బిజెపి, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగా నీట్ స్కాం విస్తరించినట్లు అర్థమవుతోంది. గతంలో మధ్యప్రదేశ్‌లో శివ్‌రాజ్‌సింగ్ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాల్లో జరిగిన వ్యాపం కుంభకోణం గుర్తుకొస్తోంది. కాగా కోర్టుల్లో విచారణ సందర్భంగా వెల్లడవుతున్న 'నీట్' అక్రమాలు అందరినీ నివ్వెరపరుస్తున్నాయి. 67 మంది అభ్యర్థులకు 720 మార్కులొచ్చాయి. వారిలో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన అరుగురు ఉన్నారు. ఒఎంఆర్ షీట్లలో ఒక విధంగా స్కోరింగ్ కార్డుల్లో మరొక విధంగా మార్కులొచ్చాయి. అనూహ్యమైన రీతిలో కటాఫ్ మార్కులు, సగటు మార్కులు పెరిగాయి. ఈ అక్రమాలు మచ్చుకు మాత్రమే. నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపిస్తే మరెన్నో అక్రమాలు వెలుగు చూడొచ్చు.

వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా ఒకే ఎంట్రన్స్ టెస్ట్ ఉండాలంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను 2019లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను ప్రవేశపెట్టింది. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో నీట్ సరైనది కాదని పలు రాష్ట్రాలు అభ్యంతరం పెట్టాయి. సామాజిక న్యాయానికి, అభ్యర్థులకు, పేదలకు, గ్రామీణ విద్యార్థులకు నష్టమన్న ఆందోళనలు బలంగా వ్యక్తమయ్యాయి. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల దోపిడీకి అవకాశం ఇవ్వడమేనన్న విమర్శలూ వచ్చాయి. అయినా బిజెపి సర్కారు పెడచెవినపెట్టి తాను అనుకున్నది చేసింది. ఆచరణలో ఆ ఆందోళనలన్నీ నిజమయ్యాయి. ఎన్‌టిఎ పనితీరు లోపభూయిష్టంగా తయారైందని పేపర్‌లీక్, ఇతర అవకతవకలు, అక్రమాలు స్పష్టం చేస్తున్నాయి. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షను 24 లక్షల మంది రాశారు. వారి భవిత అగమ్యగోచరం కావడం బాధాకరం. సుప్రీం, లేదా హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపిస్తేనే కుంభకోణం, దానితో సంబంధం ఉన్న వారి గుట్టు రట్టవుతుంది. కనీసం న్యాయస్థానం నియమించిన వారితోనైనా విచారణ జరిపిస్తే న్యాయం న్యాయం జరిగే వీలుంది. సిబిఐ అంటే, ఈ మధ్య కాలంలో ఆ సంస్థను మోడీ సర్కారు ఏ విధంగా ఆడిస్తున్నదీ చూస్తున్నాం. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా సర్వోన్నత న్యాయస్థానానికి నిజం చెప్పి సమగ్ర దర్యాప్తునకు ముందుకు రావడం బాధ్యత అనిపించుకుటుంది.

సందర్భం



పట్టు పట్టరాదు
పట్టిన తరువాత వదలకు
మధ్యలో వదిలేయడం కన్నా
చావడం మేలు

- యోగి వేమన

సవ్యసాచి మోటూరు హనుమంతరావు

నివాళి

బి తులసీదాస్

అందరూ ప్రేమగా ఎంహెచ్ అని పిలుచుకునే కామ్రేడ్ మోటూరు హనుమంతరావు వర్ధంతి ఈ రోజు. సరిగ్గా ఇరవై మూడేళ్ల క్రితం 2001 జూన్ 18న ఆయన 84వ ఏట కన్ను మూశారు. కుడి చేతితో వేసినంత కచ్చితత్వంతో ఎడమ చేతితోనూ బాణం వేయగలవాడు అర్జునుడని, అందుకాయనను సవ్యసాచి అంటారని నిఘంటువులో పేర్కొంటారు. ఏకకాలంలో బహుముఖ రీతిలో ప్రతిభను కనపర్చిన ఎంహెచ్ గారికి ఇది అక్షరాలా వర్తిస్తుంది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో 1937లో సభ్యునిగా చేరిన ఆయన ఆ తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, తదనంతరం పొలిట్‌బ్యూరో సభ్యునిగా పని చేశారు. తొలుత మితవాదంతో, ఆ తరువాత అతివాదులతో రాజకీయ, సైద్ధాంతిక విభేదాలు తలెత్తినపుడు నికరంగా నిలిచిన మార్క్సిస్టు ఆయన. శాసన సభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా అదే విధంగా రాజ్యసభ సభ్యునిగా చట్టసభల్లో కూడా సేవలందించారు. కమ్యూనిస్టు పాత్రికేయునిగా ఆయనది అందెవేసిన చెయ్యి. దిన, వార పత్రికల్లో రాయడంతోపాటు ప్రచార కరపత్రం మొదలుకొని గ్రంథాల వరకూ ఆయన రాశారు. కలం బలం చూపడమేగాక ఆయన అనర్గళమైన ఉపన్యాసకర్త. ఆయన కార్యకర్తలను ఎంతో ఆప్యాయంగా చూసేవారు. ఎన్నో సుగుణాల కలబోతయైన కామ్రేడ్ ఎంహెచ్ మనకు దూరమై నేటికి 23 ఏళ్లు గడచిపోయాయి. ఈ సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ కొన్ని అంశాలను పాఠకుల ముందుంచే యత్నమిది.

బాల్యం... విద్యాభ్యాసం

గుంటూరు (ప్రస్తుతం బాపట్ల) జిల్లా వెల్లటూరు ఆయన స్వగ్రామం. తల్లిదండ్రులు మోటూరు లక్ష్మీనారాయణ, రుక్మిణమ్మ. 1917లో జన్మించిన ఎంహెచ్ పల్లెకోనలో చదువుకున్నారు. హైస్కూలు దశలో దేశభక్తితో ఉగ్రూతలూగిన హనుమంతరావు హెడ్‌మాస్టర్ బెదిరింపులకు వెరవకుండా భగత్‌సింగ్ ఉరితీతకు అసమ్మతిగా సమ్మె చేయడం, హరిజన సహపంక్తి భోజనాలు, కల్లుగీత కుండలు పగులకొట్టడం వంటి జాతీయోద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాతీయవాదిగా 1935 వరకు వున్న ఆయన క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వైపు, ఆ తరువాత 1937లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు.

కమ్యూనిస్టుగా.... నిర్బంధాలు..



నేడు ఎం హెచ్ 23వ వర్ధంతి

> రాజకీయ సిద్ధాంత విషయాల్లో ఘర్షణ పడేటపుడు ఎంత నిశితంగా, కచ్చితంగా ఉండేవారో వ్యక్తిగత విషయాల్లో సహచరులపట్ల చాలా ప్రేమగా ఉండేవారని ఆ తరం కమ్యూనిస్టులు ఎంహెచ్‌ని కొనియాడుతారు. కార్యకర్తలపట్ల ఎంతో వాత్సల్యం కురిపించేవారు. వయసులో అంతరం ఎక్కువైనా గాని కార్యకర్తల్ని చేరదీయడం, వారికి వివిధ అంశాలను బోధపర్చి అభివృద్ధి చేయడానికి ఎంతగానో కృషి చేసేవారు. నా అనుభవమే తీసుకుంటే ఆంధ్రా యూనివర్సిటీలో చదువు పూర్తయ్యాక శ్రీకాకుళం జిల్లాకు పూర్తి కాలం కార్యకర్తగా వెళ్లి పని చేయాలని చెప్పింది ఆయనే! ఆ జిల్లాలో ఒకప్పుడు బలమైన ఉద్యమం ఉండేది నగ్జలిజం మూలంగా తీవ్రంగా నష్టపోయామని, విలువైన కార్యకర్తల్ని కోల్పోయామని ఎంతగానో బాధ పడ్డారు.

గుంటూరు విద్యార్థి ఉద్యమ కార్యకర్త. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంలో సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధ ప్రచారం. అప్పుడు జరిగిన చారిత్రాత్మక విద్యార్థి సమ్మె నాయకుల్లో ఒకరు. భాగస్వామి. 1940 మార్చి 18వ తేదీన యుద్ధ వ్యతిరేక ప్రచారంలో స్వతంత్ర భారత్ అనే రహస్య పత్రికను స్టూడెంట్స్ ఎంపోరియం ద్వారా పంచుతున్నారన్న అభియోగంతో అరెస్టు వారంటు వచ్చింది. ఆనాటి నుండి 1942 ఆగస్టు మొదటివారం వరకు రహస్య జీవితం. మళ్లీ 1947 జనవరి 21 నుండి 1947 ఆగస్టు 15 వరకు ప్రకాశం ఆర్డినెన్స్ కింద అరెస్టు వారంటు. అందువలన 1949 మే 10వ తేదీన పట్టుబడేవరకు హనుమంతరావు రహస్యజీవితం గడిపారు. 1951 సెప్టెంబర్ వరకు కడలూరు సెంట్రల్ జైలులో డిటెన్యూగా ఉన్నారు. 1962 నవంబరు 21 నుండి 1963 మే వరకు హైదరాబాద్ చంచలగూడ జైలులో డిటెన్యూగా నిర్బంధం. మళ్లీ 1964 జూన్ 14 నుండి 29 వరకు విజయవాడ, కైకలూరు జైళ్లలో రిమాండ్. తిరిగి 1964 నవంబర్‌లో కలకత్తాలో మార్క్సిస్టు పార్టీ ప్రారంభ మహాసభ జరిగిన అనంతరం 1964 డిసెంబర్ 31 నుండి 1966 జూన్ వరకు చంచలగూడ జైల్లో డిటెన్యూగా నిర్బంధం. తర్వాత రైల్వే స్ట్రయిక్, విశాఖలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం జరిగిన ఆందోళనల సందర్భంగా రెండుసార్లూ రెండు మాసాలు రహస్య జీవితం ఆ తర్వాత ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన 1975 జూన్ 26 నుండి 1977 ఫిబ్రవరి 18 వరకు 20 మాసాలపాటు రహస్య జీవితం. ఆవిధంగా బ్రిటిషు వాళ్ల పరిపాలన కింద రెండుసార్లు, కాంగ్రెస్ పాలనలో నాలుగుసార్లు మొత్తం ఐదున్నర సంవత్సరాల రహస్య జీవితం గడపవలసి వచ్చింది. మొత్తం నాలుగున్నర సంవత్సరాలపాటు జైలు జీవితం గడపవలసి వచ్చింది.

పార్టీ బాధ్యతలు

సభ్యుడుగా చేరినది 1937లో. 1938 నుండి 43 వరకు గుంటూరుజిల్లా కమిటీ సభ్యునిగా, 1943 నుండి 1948 వరకు జిల్లా కమిటీ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు. 1948 నుండి 1964 వరకు ఉమ్మడి పార్టీలో ఒకటి రెండు సంవత్సరాలు మినహా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు. 1953 మదురై పార్టీ కాంగ్రెస్ నుండి 64 వరకు కేంద్ర కమిటీ, జాతీయ కౌన్సిల్ సభ్యులు. 1964 నుండి సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులుగా, 1994నుండి 2001లో తుదిశ్వాస విడిచేవరకు పొలిట్‌బ్యూరో సభ్యునిగా పని చేశారు. 1964 నుండి 1982 వరకు సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి నుండి 2001 వరకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా కొనసాగారు.

సంపాదకుడు... రచయిత

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పత్రిక విశాలాంధ్ర ప్రధాన సంపాదకులుగా 1953 నుండి 1962 వరకూ మధ్యలో రాజకీయ కారణాల వల్ల రెండు సంవత్సరాలు మినహా మిగతా ఎనిమిది సంవత్సరాలు పనిచేశారు. తర్వాత సిపిఐ(ఎం) ఆధ్వర్యాన నడిచిన జనశక్తి వారపత్రికకు, దినపత్రికకు, ప్రజాశక్తి వార పత్రికకూ తాను సంపాదకుడిగా పేరుకు లేకపోయినా వాటి సంపాదక బాధ్యతల్ని నిర్వహించారు. 1981 నుండి దినపత్రికగా ప్రచురితమవుతున్న ప్రజాశక్తికి ఆయన వ్యవస్థాపక సంపాదకుడు. ఆ బాధ్యతల్లో 2001 వరకు కొనసాగారు.

ఉద్యమాలు జరుగుతున్న సందర్భాల్లో ప్రజలను ఉర్రూతలూగించేలా కానీ, పార్టీపై ఎదురుదాడి జరిగిన సందర్భాల్లో సైతం పార్టీ వైఖరిని వివరించి ప్రజా విశ్వాసం పొందే రీతిలో కానీ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రాజకీయ శత్రువులను వారి వైఖరులను ఎండగడుతూ కూడా ప్రచార కరపత్రాలు (బుక్‌లెట్లు) శక్తివంతంగా రాసేవారు. రాజధాని రభసకు కారకులు ఎవ్వరు?, శత్రువుల కులుకుకు మిత్రుల ఆవేదనకు కారకులెవ్వరు?, పీడిత ప్రజలపై పాలకుల రాక్షసహస్తం, వీర తెలంగాణా కోరింది విచ్ఛిత్తిగాదు- విశాలాంధ్రలో ప్రజారాజ్యం, విశాలాంధ్రలో విషాదచ్ఛాయలు వంటివి వాటిలో కొన్ని. దిగంబర కవిత్వం మార్క్సిజం గాదు, సాహిత్యోద్యమంలో మార్క్సిస్టు అవగాహన, సాహిత్య రంగంలో మార్క్సిస్టు అవగాహన వంటివి ఇప్పటికీ రిఫరెన్స్ పుస్తకాలే! రాబందుల రాజ్యం, రోజన్‌బర్గులు, మహావీరుడు అలెండి, స్టాలిన్ యుగం వంటి సుబోధకమైన అనువాదాలు ఎంహెచ్ కలం నుండి వెలువడ్డాయి.

చట్టసభల్లో ప్రజా వాణి

ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు 1952లో రేపల్లె నియోజకవర్గం నుండి, 1978-84 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యత్వం, 1988- 94 వరకు రాజ్యసభ సభ్యుడుగా ఆయన సేవలందించారు. ఆయా సందర్భాల్లో ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారు. ఏ అంశం మీద చట్ట సభల్లో ప్రసంగించినా లోతైన సమాచారంతోపాటు ఆయా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పక చర్యలు చేపట్టేవిధంగా ఒప్పించేవారు. ప్రజా కంటకమైన ప్రభుత్వ విధానాలను దునుమాడేవారు. ఇతర పార్టీలకు చెందిన సహచర సభ్యులతో సుహృద్భావ సంబంధాలు నెరిపేవారని ఆయనతో సన్నిహితంగా వున్నవారు చెబుతుంటారు. ఆయన పార్టీ ప్రతినిధిగా రుమేనియా, చైనా, సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాల్లో పర్యటించారు. తానా ఆహ్వానంపై 1983 లో ప్రపంచ తెలుగు మహాసభకు అమెరికా వెళ్లారు.

కార్యకర్తలపట్ల వాత్సల్యం

రాజకీయ సిద్ధాంత విషయాల్లో ఘర్షణ పడేటపుడు ఎంత నిశితంగా, కచ్చితంగా ఉండేవారో వ్యక్తిగత విషయాల్లో సహచరులపట్ల చాలా ప్రేమగా ఉండేవారని ఆ తరం కమ్యూనిస్టులు ఎంహెచ్‌ని కొనియాడుతారు. కార్యకర్తలపట్ల ఎంతో వాత్సల్యం కురిపించేవారు. వయసులో అంతరం ఎక్కువైనా గాని కార్యకర్తల్ని చేరదీయడం, వారికి వివిధ అంశాలను బోధపర్చి అభివృద్ధి చేయడానికి ఎంతగానో కృషి చేసేవారు. నా అనుభవమే తీసుకుంటే ఆంధ్రా యూనివర్సిటీలో చదువు పూర్తయ్యాక శ్రీకాకుళం జిల్లాకు పూర్తి కాలం కార్యకర్తగా వెళ్లి పని చేయాలని చెప్పింది ఆయనే! ఆ జిల్లాలో ఒకప్పుడు బలమైన ఉద్యమం ఉండేది నగ్జలిజం మూలంగా తీవ్రంగా నష్టపోయామని, విలువైన కార్యకర్తల్ని కోల్పోయామని ఎంతగానో బాధ పడ్డారు. రాష్ట్ర పార్టీ గైడెన్సు, విశాఖపట్నం జిల్లా సహాయంతో శ్రీకాకుళం జిల్లాలో పని చేయాలని ఆనాటి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వున్న ఆయన సుమారు గంటకుపైగా వివరించారు. తరువాతి కాలంలో శ్రీకాకుళం నుండి రాష్ట్ర కేంద్రంగావున్న విజయవాడకు నేను వచ్చినపుడల్లా కామ్రేడ్ ఎంహెచ్‌ను కలవకుండా వెళ్లింది దాదాపు లేదు. ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగానూ, తరువాత ప్రజాశక్తి సంపాదకునిగానూ ఉన్న సందర్భాల్లో కూడా మాట్లాడడం పూర్తయ్యాక నేను వెళ్తానని చెప్పిన వెంటనే 'ఛార్జీలకు డబ్బులున్నాయా?' అని ఎంతో ఆప్యాయంగా అడిగేవారు. తొలినాళ్లలో కొన్నిసార్లు రాష్ట్ర కార్యాలయం నుండి ఇప్పించారు కూడా!

రాజకీయ విషయాల్లో యువ కార్యకర్తలకు వచ్చిన సందేహాలు తీర్చడంలోనూ ఆయనది ప్రత్యేకమైన శైలి. ఎవరైనా ఉత్తరం రాస్తే ఆయన స్వహస్తాలతో కుదురైన గొలుసుకట్టు రాతలో సమాధానాన్ని పోస్టుకార్డుపై రాసేవారు. సందేహాలు పటాపంచలైపోయేవి. అది మహాసభలో కానీ జనరల్‌బాడీ సమావేశాల్లో కానీ చర్చల్లో వచ్చిన అనేకానేక అంశాలను సమ్‌అప్ చేసి సమాధానం చెప్పడంలో ఎంహెచ్ ఒరవడే వేరు! ఆయన చూపిన బాటలో నడిచి, ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడానికి కృషి చేయడమే కామ్రేడ్ ఎంహెచ్ కి మనం ఇచ్చే నివాళి. జోహార్ కామ్రేడ్ ఎంహెచ్!

విధానాలు- పోరాటాలే కమ్యూనిస్టుల విశ్వసనీయతను పెంచుతాయి

వ్యాఖ్య

సందర్భం ఏదైనా కమ్యూనిస్టుల మీద ముఖ్యంగా సిపిఎం మీద దాడి చేయడం కొందరికి మహా ఇష్టమైన వ్యసనం. అందులోనే వారికి ఆనందం, పరమానందం. జూన్ 6న ఆంధ్రజ్యోతి పత్రికలో చెరుకూరి సత్యనారాయణ రాసిన 'జన ఝంఝూ ప్రభంజనం ధాటికి కొట్టుకెళ్లిన 'జగ'జ్జనులు' వ్యాసంలో సిపిఎం పై అనేక నిందారోపణలు చేశారు. ఈ వ్యాసంలో ఎక్కడా బిజెపి ప్రమాదం గురించి ఒక్క మాటకూడా మాట్లడలేదంటే ఇది రాసింది నేనెరిగిన చెరుకూరి గారేనా లేకా బిజెపి వారా అనే అనుమానం కలిగింది. దేశ ప్రజలందరూ గుర్తించిన మోడీ మతోన్మాద రాజకీయాలను 'వామపక్షవాది' సత్యనారాయణ గుర్తించలేదంటే నమ్మగలమా? పదేళ్ళ మోడీ పాలనానుభవం చూసినతర్వాత ప్రతి అభ్యుదయ, వామపక్షవాది రాజ్యాంగాన్ని, అందులోని లౌకిక, ఫెడరల్ విధానాలను, సామాజిక భద్రతను, దేశసమైక్యతను కాపాడుకోవాలంటే ఆయనను గద్దె దించాల్సిందే అని ఏకోన్ముఖ నిర్ణయానికి వచ్చారు. ఇండియా వేదికలోలేని మరికొన్ని వామపక్ష పార్టీలు కూడా ఆంధ్రప్రదేశ్‌లో సిపిఎంను బలపరిచాయి. వారి ఓట్లను వేయించాయి. దేశమంతా ఒకదారి, నాదారి మరోదారి అన్నట్లు 'ఎపి వరకు ఆలోచిస్తే అధికార పార్టీల జయాపజయాలు ఎలా ఉన్నా, ఓడిపోయింది 'మా వామపక్ష సోదరులే' అంటూ చెరుకూరి 'మా' పై దాడికి సిద్ధపడ్డాడు. 'ముచ్చటగా మూడవసారి కూడా వారికి ప్రవేశం లేకుండానే ఆంధ్ర శాసనసభ కొలువుదీరబోతుంది' అని కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేనందుకు ముచ్చట పడుతున్నట్లు వుంది. విధానాలకు కట్టుబడి, గాలివాటం రాజకీయాలకు కొట్టుకపోనందుకు మమ్మల్ని నిందిస్తున్నాడు. "నడిరే యాకస మావర్తించిన, మేఘా లావర్షించిన, ప్రచండ ఝంఝూ ప్రభంజనం గజగజలాడించిన"అని శ్రీశ్రీ అన్నట్లు, ఎన్నికల ధన ప్రళయ భీకర ప్రవాహంలో కూడా అటు ఇటు మొగ్గకుండా సిపిఎంకు అండగా అరకు పార్లమెంట్‌లో లక్షపాతిక వేలు, ఈ పార్లమెంట్ పరిధిలోని అరకు అసెంబ్లీ లో 45 వేలు, పాడేరులో 27,700, రంపచోడవరంలో సుమారు 25 వేల మంది ఓటువేయడం సత్యానారాయణ గారి దృష్టిలో కమ్యూనిస్టులకు దక్కిన 'గౌరవప్రదంగా' కనిపించలేదు.



వి. రాంభూపాల్

'ఈ ఎన్నికల్లో కేంద్రంలో బిజెపినీ, రాష్ట్రంలో వైసీపీనీ వ్యతిరేకించమని, సాగనంపమని పిలుపునిచ్చిన వామపక్షాలు రాష్ట్రంలో వారి పిలుపునకు అనుగుణ్యమైన ప్రత్యామ్నాయం చూపడంలో విఫలం' అయ్యాయట! రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం కోసమే కదా సిపిఎం, సిపిఐ పార్టీలు కాంగ్రెసును కలుపుకుని ఇండియా వేదిక తరుపున పోటీచేసింది. ఈ వేదికను బలపరుస్తూ వడ్డేశోభనాద్రీశ్వరరావు, కె.ఎల్. విజయరావు, చలసాని శ్రీనివాసరావు, ఎంఎల్‌సీలు లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు లాంటి అనేకమంది అభ్యుదయ ప్రజాతంత్ర వాదులు వారి వయసును, ఆరోగ్యాన్ని సహితం ఖాతరు చేయకుండా వామపక్షాలు పోటీచేసిన నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రచారం చేశారు.

> ఈ ఐదేళ్ళ కాలంలో వైసీపీ ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమరశీల ప్రజా, కార్మిక ఉద్యమాలు సత్యనారాయణ గారికి గుర్తులేవోమో కాని, ఈ తెలుగునేలమీద పోరాడిన ప్రతిఒక్కరికి సీపీఎం పోరాట విశిష్టత ఏమిటో తెలుసు. నాటి ఉద్యమాలకు ఏనాడూ కనీస మద్ధతు కూడా ఇవ్వని వారు 'మా' ముసుగులో మాపై దాడి చేయడాన్ని ప్రజలు, కార్మికులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు హర్షించరు. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా మార్క్సిజం వెలుగులో పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడడం, ఎంత పెద్ద ప్రజా శత్రువైనా ఎదురేగి కలబడడం, విజయాన్ని సాధించేవరకు పోరాడడం సిపిఎం విధానం. అది ఎవరు అధికారంలో వున్నా కొనసాగుతూనే వుంటుంది.

అరకు పార్లమెంట్‌లో బిజెపి గెలవకుండా కిశోర్‌చంద్రదేవ్ లాంటి వారు సిపిఎంకు అండగా నిలిచారు. బిజెపి ఉపద్రవాన్ని సాహిత్యం ద్వారా, సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి, ఆంధ్రావనికి ఇదే ప్రత్యామ్నాయమని వేలాదిమంది చాటిచెప్పారు. కానీ 'మా' అని చెప్పే వారు ఈ రాజకీయ కృషిలో ఎక్కడున్నారు? దేశంలో ఏర్పడిన ఇండియా వేదికేకదా నేడు మతోన్మాద, రాజ్యాంగ వ్యతిరేక బిజెపిని కొంతైనా నివారించింది. అందులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెసుతో కలిసి పనిచేయడం 'షర్మిల దగ్గర దేబిరించి, ఆమె కూడా కాదంటే ఢిల్లీ స్థాయిలో పైరవీ చేసే' స్థాయికి కమ్యూనిస్టుల పరపతి పడిపోయినట్లు మీకు కనిపించడం వింతగావుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రరాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలవలేని కాంగ్రెసుతో 'దేబిరించి.... పైరవీ'లు చేసి కమ్యూనిస్టులు ఎందుకు పోటీ చేశారో మీకు తెలియదా? పదవుల కోసం ఏ గడ్డినైనా కరిసి, రోజుకో పార్టీ మార్చే నేటి రోజుల్లో రాజకీయ విధానం కోసం ఓర్పుతో కాంగ్రెసును కలుపుకుని కమ్యూనిస్టులు పనిచేయడం మీకు నేరంగా కనిపిస్తుందా? గత పది సంవత్సరాల్లో రాజ్యాంగవ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగస్ఫూర్తిని మంటగలుపుతూ, మతోన్మాద రాజకీయాలతో, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలతో దేశాన్ని సర్వనాశనం వైపు తీసుకుపోతున్న బిజెపితో పరోక్షంగా వైసిపి, ప్రత్యక్షంగా టిడిపి జతకట్టడం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదం కాదా?

'మోడీ తో కలిసాడని చంద్రబాబుని ఆడిపోసు'కున్నామట, ఆయన మోడీతో కలిస్తే కమ్యూనిస్టులకు మాత్రమే కాదు, రాష్ట్రానికి నష్టమన్నది గత అనుభవం. దేశంలో మోడీ ప్రత్యక్షంగా జతకట్టిన పార్టీలన్నీ ముఖ్యంగా తమిళనాడులో అన్నాడిఎంకె, ఒరిస్సాలో బిజెడి, మహరాష్ట్రలో శివసేన పార్టీల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? పరోక్షంగా మోడీని మోసిన బిఎస్‌పి, బిఆర్‌ఎస్ పార్టీలకు ఒక్క ఎంపీ సీటుకూడా ఎందుకు రాకుండ పోయిందో మీకు తెలియదా? మీరు అన్నట్లు 'మా ఆడిపోసుకోవడా'నికి కారణం ఈ పార్టీలకు పట్టిన దుర్గతి తెలుగుదేశానికి రాకూడదని, ఆంధ్రావని మరో మతోన్మాద ప్రయోగశాల కారదనే. దేశంలో మెజారిటీ సీట్ల తిరస్కరణకు గురైన బిజెపి కూటమిలో చేరిన టిడిపి భవిష్యత్తు మరో విషాద అనుభవంగా వుండరాదని ఆశిద్దాం. దేశవ్యాప్త రాజకీయ లక్ష్యం కోసం కాంగ్రెసుతో కలిసి కమ్యూనిస్టులు కృషి చేయడం 'షర్మిలను దేబరింపులాగా, పైరవీ'లలాగా ఈయనకు కనిపించడం, హతవిధి! 'అభ్యర్థిత్వం ఆదాయ వనరుగా మారినపుడు' అని చెత్తరాత రాసి, తన వక్రబుద్ధిని బయట పెట్టుకున్నాడు. దళిత, గిరిజన పేదలు, కష్టజీవులు, చాలీచాలనీ వేతనాలతో బతికే అసంఘటిత కార్మికులు తమ కష్టాదాయంలో నుంచి ఇచ్చిన డబ్బుతో పోటీ చేసిన కమ్యూనిస్టులను ఆదాయం కోసం పోటీ చేస్తారని శత్రవులు సహితం విమర్శించలేని స్థాయికి 'మా' సత్యనారాయణ దిగజారిపోయాడు. 'ప్రజలు కోరుకుంటున్నట్లు చంద్రబాబు విజయానికి సహకరించి ఎన్నికల తర్వాత ఆయన సహకారం అవసరమైతే ఇండియా కూటమికి జతచేసేటట్లుగా ప్రయత్నించవచ్చు కదా!' అని అమాయకంగా అడుగుతున్నాడు. ఈ ఎన్నికల్లో చంద్రబాబును కమ్యూనిస్టులు బలపరచివుంటే, మేము చెప్పినట్లు ఎన్నికల తర్వాత ఆయన ఇండియా వేదికకు జతకట్టేవాడన్నట్లు వంకర టింకర వాదన చేశాడు. చంద్రబాబునాయుడు అంత ఆమాయకుడా! కమ్యూనిస్టులు ఎలా చెబితే అలా వినేటట్లు వుంటే గత కొన్ని సంవత్సరాలుగా మతోన్మాద బిజెపితో కలవొద్దని కమ్యూనిస్టులుగా చెబుతూనే వచ్చాముకదా!

1984 ఆగస్టులో కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం ఎన్‌టిఆర్‌ను అధికారం నుండి బర్తరఫ్ చేస్తే, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరిగిన పోరాటాల్లో 1985 మధ్యంతర ఎన్నికల్లో అన్ని పక్షాలు కలిసి పనిచేయడాన్ని, నేటి పరిస్థితులను ముడివేయాలని చూస్తున్నాడు. తక్షణావసరంగా బిజెపితో కలిసిన ఎన్‌టిఆర్ ఆ తర్వాత కొద్దికాలానికే అదే బిజెపికి వ్యతిరేకంగా కేంద్రంలో వివిధ పార్టీలతో కలిసి నడచిన విషయం మీ జ్ఞాపకాల్లో ఎలాలేకుండ పోయింది? 'ఏపీలో కూడా మరోరకమైన ఎత్తుగడ ఎందుకు అనుసరించలేదు?' అని కమ్యూనిస్టులను ప్రశ్నిస్తున్నాడు. అంటే బిజెపితో కలిసిన వారితో మీరు ఎందుకు స్నేహం చేయలేదన్నది ఆయన ప్రశ్న. ఈయన కోరినట్లు చేయడం కమ్యూనిస్టుల మౌలిక స్వభావానికే కాక, నేటి తక్షణ దేశ పరిస్థితులకు అత్యంత ప్రమాదకరం కాదా! బిజెపిని బలపరిచే విధానాన్ని తప్పుపట్టినందుకు 'వామపక్ష శ్రేణులు ముఖ్యంగా సీపీఎం గాని, ఆ పార్టీకి చెందిన కొందరు మేధావులు గాని ఇద్దరు దొంగలపై పెట్టే విమర్శల్లో పెద్దదొంగ పట్ల పట్ల విమర్శల స్థాయి తక్కువ చేసి తమ విశ్వనీయతను పోగొట్టుకున్నారట' ఈయన దృష్టిలో పెద్ద దొంగ అంటే వైసీపీ కావొచ్చు. మరీ బీజేపీ ఏ స్థాయి దొంగో చెప్పలేదు! కమ్యూనిస్టుల విశ్వనీయత అవి అనుసరించే ప్రజానుకూల విధానాల ద్వారా, చేసే ప్రజాపోరాటాల ద్వారా వస్తుందే తప్ప సీట్ల కోసం ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం ద్వారా రాదు.

'పార్టీ పార్లమెంటరీ ప్రజాపంథా స్వీకరించిన నాటినుంచి... ఎత్తుగడల వైఫల్యాలు వున్నాయి' అని చెబుతున్నాడు. పార్లమెంటరీ పంథా అంటే కేవలం ఓట్లు, సీట్లు అని ఈయన అనుకుంటున్నాడు. పోనీ అదే అనుకున్నా పశ్చిమబెంగాల్, త్రిపుర ల్లో సుదీర్ఘకాలం, ప్రస్తుతం కేరళలో పరిపాలిస్తున్నది వామపక్షాలే కదా! సిపిఎం దృష్టిలో 'ఎత్తుగడలు' అంటే కేవలం ఎన్నికల కోసం వేసే జిమ్మిక్కులు కాదు, విప్లవోద్యమాన్ని నిర్మించే కృషిలో భాగంగా పార్లమెంటరీ, పార్లమెంటరేతర రంగాల్లో అనుసరించే ఆచరాణత్మక పట్టువిడుపులు. చెరుకూరు వారు మాత్రం 'విప్లవోద్యమాన్ని ఎలాగూ నిర్మించలేం. కనీసం పార్టీని పార్లమెంటరీ పంథాలోనైనా సరైన ఎత్తుగడలతో నడిపి మరో ఐదేళ్ళ తర్వాతనైనా' అసెంబ్లీలోకి వెళ్ళమని మాకు సలహా ఇస్తున్నాడు. విప్లవోద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు ఎవరైనా కలుస్తారు, నిలుస్తారు. కానీ శత్రువు కొత్తరూపాల్లో ప్రజలను భ్రమింపచేస్తున్నప్పుడు, ఎదురుదెబ్బలు తీవ్రమౌతున్నపుడు, భౌతికశక్తి సన్నగిల్లుతునప్పుడు నమ్మిన ఆశయాన్ని తుదకంటూ కొనసాగించే కష్టజీవులు, వారికి నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఇప్పటి వరకు చరిత్రగతిని మార్చాయి. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత అసమానకరమైందో, ఎంత అనాగరికమైందో, ఎంత దుర్మార్గమైందో ప్రపంచ ఆర్థికవేత్తలు తాజాగా ప్రకటిస్తున్న నివేదికలు చాటిచెబుతున్నాయి. ఈ స్థితికి ప్రత్యామ్నాయం ఈ సమాజాన్ని మార్చడం తప్ప మరో ప్రత్యామ్నాయం ఏముంది? ఒకవైపు పోరాటాల ద్వారా, అనుభవాల ద్వారా ప్రజా చైతన్యాన్ని పెంచడం, మరోవైపు శత్రువులు వారి అవసరాల కోసం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుంటూ తక్షణ లక్ష్యాన్ని సాధించడానికి ఆచరణాత్మక విప్లవ ఎత్తుగడలు రూపొందించుకోవడం సిపిఎం విధానం.

ఈ ఐదేళ్ళ కాలంలో వైసీపీ ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమరశీల ప్రజా, కార్మిక ఉద్యమాలు సత్యనారాయణ గారికి గుర్తులేవోమో కాని, ఈ తెలుగునేలమీద పోరాడిన ప్రతిఒక్కరికి సీపీఎం పోరాట విశిష్టత ఏమిటో తెలుసు. నాటి ఉద్యమాలకు ఏనాడూ కనీస మద్ధతు కూడా ఇవ్వని వారు 'మా' ముసుగులో మాపై దాడి చేయడాన్ని ప్రజలు, కార్మికులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు హర్షించరు. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా మార్క్సిజం వెలుగులో పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడడం, ఎంత పెద్ద ప్రజా శత్రువైనా ఎదురేగి కలబడడం, విజయాన్ని సాధించేవరకు పోరాడడం సిపిఎం విధానం. అది ఎవరు అధికారంలో వున్నా కొనసాగుతూనే వుంటుంది.

(సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

మోడీ సర్కారు వైఫల్యమే

- రైల్వే ప్రమాదంపై ప్రతిపక్షాలు
- నిర్వహణ లోపమే కారణం : ఖర్గే



మల్లికార్జున ఖర్గే | రాహుల్ గాంధీ | డి రాజా

న్యూఢిల్లీ : గత పదేళ్లలో మోడీ ప్రభుత్వ హయాంలో 117 రైల్వే ప్రమాదాలు జరిగాయని, వీటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదంలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులు మరోవైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపైనా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రైలు ప్రమాదానికి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అధ్యక్షులు, రైల్వే శాఖ మాజీ మంత్రి మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. పూర్తిగా నిర్వహణ లోపంతోనే రైలు ప్రమాదం జరిగిందని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో మోడీ ప్రభుత్వం రైల్వే శాఖను పూర్తిగా దుర్వినియోగం చేసిందని పేర్కొంటూ ఖర్గే ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'బాధ్యత గల ప్రతిపక్షంగా.. మోడీ ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖను 'కెమెరాతో నడిచే' స్వీయ ప్రచార వేదికగా ఎలా మార్చివేసిందో వెల్లడించడం మా కర్తవ్యం. ఈరోజు జరిగిన దుర్ఘటన ఇలాంటి కఠోర నిజాలను మరోసారి గుర్తు చేసింది. భారతీయ రైల్వేలను నేరపూరితంగా వదిలివేసినందుకు మోడీ ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తాం' అని కాంగ్రెస్ అధ్యక్షులు తెలిపారు.

తప్పుడు నిర్వహణకు ఫలితమే ఈ ప్రమాదాలు : రాహుల్ గాంధీ

మోడీ ప్రభుత్వ తప్పుడు నిర్వహణ, నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఫలితంగానే గత పదేళ్లలో రైల్వే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. 'బాధ్యత గల ప్రతిపక్షంగా ఈ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని మేం ప్రశ్నిస్తూనే ఉంటాం, ఈ ప్రమాదాలకు మోడీ ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తాం' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ కూడా ఈ ప్రమాదంపై తీవ్రంగా స్పందించారు. ఎక్స్‌లో చేసిన ట్వీట్‌లో 'ఘోరమైన బాలాసోర్ ప్రమాదం తరువాత కూడా రైల్వే శాఖలో ఎటువంటి జవాబుదారీతనం లేదు, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నిరోధించడానికి ఎటువంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంతోనే తాజా విపత్తు చోటు చేసుకుంది. భారతీయ రైల్వేల్లో భద్రతా ప్రమాణాలు క్షీణించడానికి ప్రధాన మంత్రి, రైల్వే శాఖ మంత్రి బాధ్యత వహించాలి' అని వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

బాధితులను ఆదుకోవాలి : డి రాజా

రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను, గాయపడిన వారిని ఆదుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి మౌలిక సదుపాయాలు, రైలు ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థ, శిక్షణ ఉన్న సిబ్బంది వంటి అంశాలపై రైల్వే మంత్రిత్వశాఖ దృష్టి పెట్టాలి. గతంలో రైల్వేలకు ప్రత్యేక బడ్జెట్ ఉండేది. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పరిస్థితి లేదు' అని డి రాజా విమర్శించారు.

బాధ్యత తీసుకోని రైల్వే మంత్రి : ఎన్‌సిపి


25 ఏళ్ల క్రితం 1999లో గైసాల్ రైలు ప్రమాదంలో 285 మంది మరణించిన సందర్భంలో అప్పటి రైల్వే శాఖ మంత్రి నితీష్‌కుమార్ రాజీనామా చేసిన వీడియోను ఎన్‌సిపి ఎక్స్‌లో పోస్టు చేసింది. 'కానీ, మోడీ ప్రభుత్వంలోని అశ్విని వైష్ణవ్ తన పదవీకాలంలో రెండు భారీ ప్రమాదాలు జరిగినా బాధ్యత తీసుకోవడానికి అంగీకరించడం లేదు' అని పోస్టు చేసింది.

ఛార్జీలు పెంచడంపైనే దృష్టి : మమత బెనర్జీ

కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయాణీకుల భద్రతను, సౌకర్యాలను మెరుగుపర్చడం లేదని, కేవలం ఛార్జీలను పెంచడంపైనే దృష్టి పెట్టిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ విమర్శించారు. రైల్వేలు పూర్తిగా 'పేరెంట్‌లెస్'గా మారాయి.

ప్రయాణీకుల భద్రతను, సౌకర్యాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఛార్జీలను పెంచడంపైనే వారి దృష్టి ఉంది' అని ఆరోపించారు. 'వారు బిగ్గరగా మాట్లాడతే మీరు చూస్తారు. రైల్వే అధికారులు, టెక్నికల్, 'సేఫ్టీ, సెక్యూరిటీ సిబ్బందిని కూడా వారు పట్టించుకోవడం లేదు' అని మమత విమర్శించారు. ప్రమాదాలను నివారించే యాంటీ-కొలిజన్ సిస్టమ్‌ను సక్రమంగా రైల్వే మంత్రిత్వ శాఖ అమలు చేయడం లేదని విమర్శించారు.

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా ఎన్‌సిఇఆర్‌టి : జైరాం రమేష్



న్యూఢిల్లీ : 2014 నుండి ఎన్‌సిఇఆర్‌టి ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం పెద్ద ఎత్తున రాజ్యాంగంపై దాడికి దిగుతోందని మండిపడ్డారు. నీట్ 2024 ఫలితాల్లో గ్రేస్ మార్కులపై ఎన్‌సిఇఆర్‌టికి చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తప్పుపట్టిందని ఎక్స్‌లో సోమవారం ఆయన పోస్ట్ చేశారు. ఈ చర్య ఎన్‌టిఎ సొంత వైఫల్యాల నుండి దారి మళ్లించేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌సిఇఆర్‌టి వృత్తిపరమైన సంస్థ కాదన్నది వాస్తవమని, 2014 నుండి ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. సవరించిన 11వ తరగతి పొలిటికల్ సైన్స్‌లో లౌకికవాదం అంశాన్ని తప్పుగా పేర్కొందని, రాజకీయ పార్టీల విధానాలను పరిగణనలోకి తీసుకుందని అన్నారు. లౌకికవాదం భారత గణతంత్ర రాజ్యానికి మూల స్తంభంగా పేర్కొన్న రాజ్యాంగ ప్రవేశికపై ఎన్‌సిఇఆర్‌టి దాడికి దిగుతోందని మండిపడ్డారు. రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో లౌకికవాదం ముఖ్యమైన భాగమని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్‌సిఇఆర్‌టి లక్ష్యం పాఠ్యపుస్తకాల రూపొందించడమని, రాజకీయ పార్టీల కరపత్రం, ప్రచారాలను తయారు చేయడం కాదని అన్నారు. ఎన్‌సిఇఆర్‌టి అంటే 'నాగ్‌పూర్ లేదా నరేంద్ర కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' కాదని వ్యాఖ్యానించారు.

ఎన్‌డిఎ ప్రభుత్వం తమకు అనుకూలంగా లేవని వాస్తవాలను విద్యార్థులకు బోధించకుండా దాచిపెట్టడం సిగ్గుచేటని టిఎంసి నేత సాకేత్ గోఖలే విమర్శించారు. ఈ లాజిక్ ప్రకారం .. హింసాత్మక, అణచివేయబడిన అంశాలైన వరల్డ్ వార్ గురించి కూడా ప్రస్తావించకూడదని అన్నారు. నేరపూరిత వ్యక్తులు, తిరుగుబాటుదారులుగా బిజెపి, మోడీ చరిత్రకెక్కడం సిగ్గు చేటని అన్నారు. విద్యార్థుల నుండి వాస్తవాలను ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు.

ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ ఎంపి కె. సురేష్ .. !

న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈ నెల 24 నుండి ప్రారంభం కానున్నాయి. 26న లోక్‌సభ కొత్త స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. అప్పటి వరకు ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ నేత కె. సురేష్ పేరును పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. కేరళలోని మవెలికర ఎంపి అయిన కె.సురేష్... దీర్ఘకాలం పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అనంతరం ప్రధాని మంత్రి మండలి, ఇతర ఎంపిలతో ఆయన ప్రమాణం చేయించనున్నారు.

బస్సుపై ఉగ్రదాడి కేసు ఎన్‌ఐఎకు అప్పగింత

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో ప్రయాణీకుల బస్సుపై ఉగ్రదాడి కేసును విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)కు కేంద్ర హోం మంత్రిత్వశాఖ సోమవారం అప్పగించింది. ఈ నెల 9న జమ్ముకాశ్మీర్‌లోని రైసీ జిల్లాలో బస్సుపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డంతో బస్సు లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో తొమ్మిదిమంది మరణించగా, 41 మంది గాయపడ్డారు. బస్సులోని ప్రయాణికులంతా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన వారు. ఈ కేసు విచారణను ఎన్‌ఐఎకు అప్పగించినట్లు ఈ సంస్థకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు. జమ్ముకాశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపైనా, అమర్‌నాథ్ యాత్రకు సన్నద్ధతా ఏర్పాట్లపైనా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు వరస సమీక్షా సమావేశాలు నిర్వహించిన తరువాత రోజే ఈ నిర్ణయం వెలువడ్డం విశేషం. బస్సుపై ఉగ్రదాడితోపాటు జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల కాలంలో మరికొన్ని ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో అమిత్ షా ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.



రాయ్‌బరేలీ నుంచే రాహుల్ ప్రాతినిధ్యం

- వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ

న్యూఢిల్లీ : రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించాలని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ నిర్ణయించుకున్నారు. వాయనాడ్ నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేయనున్నారు. ఈ నిర్ణయాలను న్యూఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం తీసుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరెలి నుంచి, కేరళలోని వాయనాడ్ నుంచి రాహుల్ గాంధీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ రెండింటిలో ఏ స్థానాన్ని రాహుల్‌గాంధీ వదులుకుంటారో అని కొన్ని రోజులుగా సందిగ్ధం నెలకుంది. సోమవారంతో ఆ ఉత్కంఠ వీడింది.

బెంగాల్‌లో ఘోరానికి సిగ్నల్ జంపింగే కారణమా?

- గూడ్స్ రైలు డ్రైవర్ తప్పేమీ లేదంటున్న రైల్వే వర్గాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రైలు ప్రమాదానికి సిగ్నల్ జంపింగే కారణమా? అనే చర్చ జరుగుతోంది. సిగ్నల్ జంప్ కారణంగా ప్రమాదం జరిగిందని రైల్వే బోర్డు సిఇఒ జయ వర్మ సిన్హా తెలిపారు. నిర్వహణా లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ విమర్శించింది. దీనికి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ డిమాండ్ చేశారు. 'నిర్వహణా లోపం కారణంగానే రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్‌లపై ఒత్తిడి పెరుగుతోంది. భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఒడిషా రైలు ప్రమాదం నుండి ప్రజలు తేరుకోకముందే ఈ ప్రమాదం చోటుచేసుకుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. రైల్వే ప్రమాదాలు పెరుగుతున్నాయని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

రైల్వే భద్రతా కమిషనర్ ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తారని రైల్వే మంత్రి వైష్ణవ్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గూడ్స్ రైలు డ్రైవర్ తప్పేమీ లేదు...

అయితే గూడ్స్ రైలు డ్రైవర్ తప్పేమీ లేదని డాక్యుమెంట్లు తెలియజేస్తున్నాయి. రెడ్ సిగ్నల్స్‌ను దాటేందుకు అనుమతించారని, అయితే ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఫెయిలవడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని అంతర్గత పత్రాలు తెలియజేస్తున్నాయి. రాతపూర్వకమైన డాక్యుమెంట్ టిఎ 912ను రాణిపాత్ర స్టేషన్ మాస్టర్ గూడ్స్ రైలు డ్రైవర్‌కు అందచేశారు. అన్ని రెడ్ సిగ్నల్స్‌ను దాటడానికి అనుమతినిచ్చారని రైల్వే వర్గాలు తెలిపాయి. ఆటోమేటిక్ సిగ్నలింగ్ ఫెయిలైనందున రాణిపాత్ర స్టేషన్ నుండి చత్తార్ హట్ జంక్షన్‌కు మధ్య గల అన్ని ఆటోమేటిక్ సిగ్నల్స్‌ను దాటేందుకు మీకు అనుమతిస్తున్నామని ఆ లేఖ పేర్కొంది. ఈ రెండు స్టేషన్ల మధ్య మొత్తంగా 9 సిగ్నల్స్ వున్నాయని, అవి రెడ్ సిగ్నల్ లేదా ఎల్లో, డబుల్ ఎల్లో సిగ్నల్స్ వేసి వున్నా వాటిని దాటేయవచ్చని ఆ లేఖ పేర్కొంది. ఆ సెక్షన్‌లో ఆ లైన్‌పై ఏ రైలుగానీ ఇతరత్రా అడ్డంకి గాని లేదని టిఎ 912 అర్థమని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. స్టేషన్ మాస్టర్ అలా ఎందుకు చేశారో దర్యాప్తు చేయాల్సి వుందని, బహుశా కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ ఆ సెక్షన్ దాటేసి వుంటుందని అనుకుని వుండవచ్చని ఆ వర్గాలు చెప్పాయి. సోమవారం ఉదయం 5.30గంటల నుండి ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయడం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు ఉదయం 8.27 గంటలకు కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ ఈ రెండు స్టేషన్ల మధ్య ఆగింది. ఎందుకు ఆగిందో కారణం తెలియరాలేదని ఆ వర్గాలు తెలిపాయి.

అంతా క్షణాల్లో జరిగిపోయింది

ప్రమాదం జరిగిన సమయంలో ఏం జరిగిందో అర్థం కాలేదని ప్రయాణికులు తెలిపారు. తాను బి-1 బోగీలో ఉన్నానని, అకస్మాత్తుగా రైలు ప్రమాదానికి గురైందని, తనకు తలపై పెద్ద గాయమైందని, కిందికి దిగి చూస్తే వెనుక నుండి గూడ్సు రైలు ఢీకొట్టినట్లు అర్థమైందని ఓ ప్రయాణికుడు చెప్పాడు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని వ్యాఖ్యానించారు. ప్రమాద సమాచారం తెలియగానే అధికారులు, వైద్యులు, అంబులెన్సులు, విపత్తు నిర్వహణ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

పోక్సో కేసులో విచారణకు హాజరైన యడ్యూరప్ప

బెంగళూరు : పోక్సో కింద నమోదైన కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు బిఎస్ యడ్యూరప్ప సిఐడి ముందు సోమవారం విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో యడ్యూరప్పకు వ్యతిరేకంగా ఈ నెల 13న ఫాస్ట్ ట్రాక్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే హైకోర్టులో యడ్యూరప్పకు ఊరట లభించింది. ఈ నెల 28న జరిగే తదుపరి విచారణ వరకూ యడ్యూరప్పను అరెస్టు చేయవద్దని పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే సిఐడి ముందు సోమవారం విచారణకు హాజరుకావాలని కూడా మాజీ ముఖ్యమంత్రిని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సిఐడి కార్యాలయానికి సోమవారం ఉదయం యడ్యూరప్ప చేరుకున్నారు. సిఐడి అధికారుల సమాచారం ప్రకారం యడ్యూరప్ప వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తరువాత మధ్యాహ్న సమయంలో ఆఫీసు నుంచి యడ్యూరప్ప వెళ్లిపోయారు. 2012లో 17 ఏళ్ల బాలికపై యడ్యూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడినట్లు 2015లో ఈ పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే.

ఇజ్రాయిల్ వార్ కేబినెట్ రద్దు

- కొనసాగుతున్న దాడుల్లో డజన్ల సంఖ్యలో మృతి

జెరూసలేం : గాజాలో దాడులను పర్యవేక్షించే వార్ కేబినెట్‌ను ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు రద్దు చేశారు. ఈ కేబినెట్‌లో కీలక సభ్యుడు రిటైర్డ్ జనరల్ బెనీ గాంట్జ్ , మరి కొందరు రాజీనామా చేయడంతో ఈ చర్య తీసుకున్నట్లు మీడియా వార్తలు తెలిపాయి. ఆదివారం జరిగిన కేబినెట్ సమావేశంలో నెతన్యాహు ఈ విషయాన్ని ప్రకటించినట్లు తెలిసింది. మాజీ రక్షణ మంత్రి అయిన గాంట్జ్ పోర్టుఫోలియో లేని మంత్రిగా వార్ కేబినెట్‌లో ఉన్నారు. నెతన్యాహు విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల ఆరంభంలో ఆయన రాజీనామా చేశారు. ఆ వెంటనే, మరో మంత్రి, మాజీ ఐడిఎఫ్ చీఫ్ గాది ఇసెన్‌కట్ కూడా కేబినెట్‌కు రాజీనామా చేశారు. ఆ వెంటనే పార్లమెంట్ సభ్యుడు ట్రాపర్ కూడా వైదొలగుతున్నట్లు ప్రకటించారు. గాజాలో యుద్ధానికి ఒక వ్యూహాన్ని రూపొందించడంలో నెతన్యాహు విఫలమవడమే ఈ రాజీనామాలకు కారణమని వారు తెలిపారు. వార్ కేబినెట్‌ను కాకుండా మొత్తంగా ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ప్రతిపక్ష నేత యాసిర్ లాపిడ్ వ్యాఖ్యానించారు. బందీల విడుదలకై హమాస్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని లేదా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇజ్రాయిల్ దాడుల్లో ఐదుగురు పిల్లలసహా డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్ల మృతి

సెంట్రల్, దక్షిణ గాజాలో గత 24గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఐదుగురు పిల్లలతో సహా డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారు. గాజా సహాయ కారిడార్ పొడవునా వ్యూహాత్మకమైన రీతిలో విరామాలను ప్రకటిస్తామని మిలటరీ ప్రకటించినప్పటికీ వాస్తవిక పరిస్థితులు భిన్నంగా వున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ చీఫ్ ఫిలిప్ లాజారిని ప్రకటించారు.



గత పదేళ్లలో మసకబారిన భారత ప్రతిష్ట!

న్యూఢిల్లీ : "భారత్ అంతర్జాతీయ వేదికలపై మాట్లాడుతుంటే, యావత్ ప్రపంచం శ్రద్ధగా ఆలకిస్తుంది" అని ప్రధాని నరేంద్ర మోడీ మొన్న మే నెలలో ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా వ్యాఖ్యానించారు. అంతటితో ఆగలేదు "భారత్ నిర్ణయాలు తీసుకుంటుంటే ప్రపంచం అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది." అని కూడా సెలవిచ్చారు.

20014, 2019 ఎన్నికల్లో బిజెపి అవినీతి, హిందూ జాతీయవాదం, దేశీయంగా, పాకిస్తాన్‌లో పుట్టుకొచ్చిన ఉగ్రవాదంపై బిజెపి ఫోకస్ పెట్టింది. విదేశాంగ విధానం ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా చోటు చేసుకోవడం మన విదేశాంగ విధాన చరిత్రలో ఇదే మొదటిసారి. మోడీ ప్రతి ప్రసంగంలోను భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మేటి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, బ్రిటన్‌ను వెనక్కి నెట్టి భారత్ అయిదవ అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎలా ఎదిగిందీ, గత ఏడాది జి-20 శిఖరాగ్ర సమావేశాన్ని భారత్ ఎంత బ్రహ్మాండంగా నిర్వహించిందీ టామ్‌టామ్ వేస్తూ ఇదంతా తన నాయకత్వ గొప్పతనమేనన్నట్లుగా చెప్పుకున్నారు.

తమిళనాడులో సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఏనాడో పరిష్కారమైపోయిన శ్రీలంక కచతీవు దీవుల వివాదాన్ని ఆయన కెలికారు. జూన్4న వెలువడిన ఎన్నికల ఫలితాలు మోడీని నేలమీద నిలిచేలా చేశాయి. పార్లమెంటులో బిజెపికి మెజార్టీ లేకుండా చేస్తూ ఓటరు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చాడు. ప్రతిపక్షాలను ఒంటి చేతితో అణచివేస్తూ, తనకిక ఎదురే లేదని విర్రవీగిన మోడీ తోకను కత్తిరించేశాడు.. మిత్రులపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడిపే స్థితికి తెచ్చాడు. ఈ కొత్త డైనమిక్స్ వచ్చే అయిదేళ్లలో భారత విదేశాంగ విధాన దిశను నిర్దేశించడంలో కీలక భూమిక వహించనున్నాయి. మోడీ గత పదేళ్లలో విదేశాంగ విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలను మంత్రివర్గాన్ని సంప్రదించకుండా తనే తీసుకునేవాడు. అటువంటి కీలకమైన వాటిలో అక్టోబరు7న హమాస దాడి జరిగిన కొద్ది గంటలకే ఇజ్రాయిల్‌కు సంఘీభావం ప్రకటించడం, దీంతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో పడిన విదేశాంగ శాఖ దానిని సరిదిద్దేందుకు బ్యాలెన్స్‌గా ప్రకటన చేయడానికి చాలా రోజులు పట్టింది.

గ్లోబల్ లీడర్‌గా భారత్ స్థానాన్ని పటిష్టపరచేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్విత సభ్యత్వ హోదా తన ప్రాధాన్యత అంశంగా భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఐరాస సమావేశాల సందర్భంగా నిర్వహించే 'భవిష్యత్తు కోసం సదస్సు' ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలకు ఒక చారిత్రాత్మక అవకాశం. దీనిని ఈ కొత్త ప్రభుత్వం ఎలా ఉపయోగించుకుంటుందో చూడాలి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులను చూస్తే అది అంత తేలికైన విషయమేమీ కాదు. అమెరికా చెంతన చేరి చైనా లక్ష్యంగా ఇండో పసిఫిక్ వ్యూహంలో కీలక పాత్రధారిగా మోడీ వ్యవహరించడం ద్వారా పొరుగున ఉన్న చైనాతో సఖ్యత చెడేందుకు అవకాశమిచ్చారు. భద్రతా మండలిలో శాశ్విత సభ్యత్వ హోదా రావాలంటే చైనా మద్దతు కూడా అవసరం. కాబట్టి మోడీ లక్ష్యం ఏమేరకు నెరవేరుతుందో చూడాలి. ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచ నేతలు పలువురు మోడీకి అభినందనలు తెలియచేశారు. కానీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇంతవరకు మోడీని స్వయంగా అభినందించలేదు. చైనా తరపున విదేశాంగ శాఖ అభినందనలు తెలపడంతోనే సరిపెట్టింది. మోడీ హయాంలో చైనాతో సంబంధాలు అంత సవ్యంగా లేవనడానికి ఇదొక నిదర్శనమని పరిశీలకులు పేర్కొంటున్నారు. చైనాతో సంక్లిష్టమైన సంబంధాలను జాగ్రత్తగా నిర్వహించుకోవడంలో దౌత్యపరమైన కార్యకలాపాలు చాలా కీలకం. ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాలంటే ఉద్రిక్తతలు, ప్రాదేశిక వివాదాల పట్ల ఆచితూచి వ్యవహరించాల్సి వుంది.

ఐటుయుటు (ఇండియా, శ్రీలంక, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), కొలంబో సెక్యూరిటీ కాన్క్లేవ్, క్వాడ్ వంటి వేదికలు ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్య వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లే వేదికలుగా మారాయి. మరోవైపు కెనడాతో భారత్ సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. అలాగే పాకిస్తాన్‌తో సంబంధాలు అంతంత మాత్రంగానే వున్నాయి. ఈ పరిస్థితుల్లో పరిమితమైన సంబంధాలు, కార్యకలాపాలు అనే ప్రస్తుత విధానాన్నే మోడీ సర్కార్ అవలంబించే అవకాశం వుంది.

సుదీర్ఘకాలం తర్వాత దేశంలో సంకీర్ణ రాజకీయాలు ఆరంభమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో మోడీ విదేశాంగ విధాన దిశ బహుళ ధ్రువ ప్రపంచం వైపు ఉంటుందా? లేక అమెరికన్ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఇప్పుడనుసరిస్తున్న వైఖరినే కొనసాగిస్తుందా అన్నది ప్రశ్న. మోడీ ఇంతకుముందులా ఏకపక్షంగా వ్యవహరించడం ఇక కష్టమే కావచ్చని ఐక్యరాజ్య సమితి మాజీ ప్రతినిధి ఇడి మాథ్యూ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

జి 7 డిక్లరేషన్ అబద్ధాల పుట్ట !

- అహంకారం, పక్షపాతంతో కూడినది
- తీవ్రంగా స్పందించిన చైనా

బీజింగ్ : జి-7 సదస్సు విడుదల చేసిన డిక్లరేషన్ పూర్తిగా అబద్ధాల పుట్ట అని, అహంకారంతో, పక్షపాతంతో కూడినదని చైనా విమర్శించింది. గత వారం ఇటలీలో సమావేశమైన జి 7 నేతలు చైనాతో వాణిజ్య సంబంధాలపై, ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలపై, దక్షిణ చైనా సముద్ర జలాలపై ప్రధానంగా చర్చించి, డిక్లరేషన్ విడుదల చేశారు. అనేక విషయాల్లో చైనాపై తీవ్రంగా ఆరోపణలు చేసిన నేపథ్యంలో చైనా స్పందన వెలువడింది. రష్యాకు ఆయుధాల విడి భాగాలను పంపడాన్ని చైనా ఆపాలని కూడా వారు వ్యాఖ్యలు చేశారు. వీటిపై సోమవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్‌జియాన్ మాట్లాడుతూ, చైనాపై అపవాదులు వేస్తూ, జి 7 సదస్సు దాడి చేసిందని విమర్శించారు. వారు చేసిన ఆరోపణలకు ఎలాంటి చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని, వాస్తవాలు లేవని, పైగా నైతికంగా సమర్ధనీయం కావని పేర్కొన్నారు. పైగా పూర్తి అహంకారం, పక్షపాతం, అసత్యాలతో కూడి వారి డిక్లరేషన్ వుందన్నారు. గతేడాది జపాన్‌లో జరిగిన సదస్సు సందర్భంగా ఉపయోగించిన పదజాలం కన్నా పరుషమైన పదజాలంతో ఈసారి జి 7 డిక్లరేషన్ వుంది. దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనికీకరణను, బలవంతపు, బెదిరింపు చర్యలను, కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రమాదకరమైన రీతిలో సామర్ధ్యానికి మించి వ్యవహరిస్తోందని డిక్లరేషన్ విమర్శించింది. దానిపై లిన్ స్పందిస్తూ, మితిమీరిన సామర్ధ్యమంటూ జి 7 చేసిన ఊహాగానాలు పూర్తిగా వాస్తవాలను, ఆర్థిక చట్టాలను పక్కదారి పట్టించేలా వున్నాయని విమర్శించారు. రక్షణవాదం కొరకు సాకులు సృష్టిస్తున్నారన్నారు. వాతావరణ మార్పులకు సంబంధించిన సహకారానికి, తక్కువ కార్బన్లు వెలువడే ప్రయత్నాలను దెబ్బతీసేలా వున్నాయని విమర్శించారు. జి-7 అంతర్జాతీయ సమాజాన్ని ప్రతిబింబించదన్నారు. అమెరికా, పశ్చిమ దేశాల గుత్తాధిపత్యాన్ని పరిరక్షించే సాధనమని విమర్శించారు.

రక్షణ, ప్రాంతీయ భద్రతపై సులివాన్‌తో అజిత్ దోవల్ చర్చ



న్యూఢిల్లీ : రక్షణ, ప్రాంతీయ భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంపొందించే విషయమై జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ సోమవారం అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో చర్చలు జరిపారు. కీలకమైన, కొత్తగా ఆవిర్భవించే సాంకేతికతలపై భారత్, అమెరికా చొరవను (ఐసెట్) అమలు చేయడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. అలాగే ద్వైపాక్షిక రక్షణ సంబంధాలు, ప్రాంతీయ భద్రతా పరిస్థితులపై కూడా చర్చించారు. సోమ, మంగళవారాల్లో సులివాన్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీనియర్ అమెరికా ప్రభుత్వ అధికారి భారత్‌లో జరుపుతున్న మొదటి పర్యటన ఇది. సీనియర్ ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక నేతలతో కూడిన ప్రతినిధి బృందం ఆయన వెంట వచ్చింది. ప్రతిపాదిత భారత్-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇసి) కూడా వీరు చర్చించినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులతో ఇప్పటికే ఈ చొరవ అమలులో ఆలస్యం జరిగింది. విదేశాంగ మంత్రి జై శంకర్‌తోకూడా ఆయన భేటీ అయ్యారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించినట్లు జైశంకర్ ఎక్స్‌లో తెలిపారు. పరస్పర ప్రయోజనాలతో కూడిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని సమీక్షించారు. భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహిస్తున్న భారత్-అమెరికా ఐసెట్ రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం జరగనుంది. ఈ సమావేశానికి పారిశ్రామిక రంగ సిఇఒలు హాజరవుతారు. గాజాపై ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో తలెత్తిన పరిస్థితులపై అమెరికా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిన నేపథ్యంలో ఐసెట్ సమీక్ష కోసం భారత్‌కు రావాల్సిన పర్యటనను సులివాన్ ఈ ఏడాదిలో ఇప్పటికే రెండుసార్లు రద్దు చేసుకున్నారు.



మీకోసం

కుక్కర్‌లో అన్నం, పప్పు వండేటప్పుడు అందులో పొడవాటి చెంచా వేస్తే ఎసరు బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

వలస బతుకుల విషాదం!

కుటుంబ పోషణ కోసం, పిల్లల చదువుల కోసం ఇళ్లు వాకిళ్లు వదిలి, భార్యాబిడ్డలను విడిచి మన దేశం నుంచి లక్షలాదిమంది సుదూరాలకు వలస వెళతారు. ప్రమాదకరమని తెలిసినా ఇరుకు గదుల్లో, శిథిలమవుతున్న భవనాల్లోనే నివసిస్తారు. ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినా అదనపు పని గంటలు పనిచేస్తారు. ఇంతా చేస్తే, వాళ్ల బతుకులు ఎప్పుడు తెల్లారిపోతాయో వాళ్లకే తెలియదు. గత వారం దుబాయ్ మంగాఫ్ ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదం ఈ పరిస్థితులకు ఒక ఉదాహరణ. ఆ రోజు 40 మందికి పైగా కార్మికులు చనిపోతే- అందులో భారతీయులే ఎక్కువ.

కొడుకును ఉన్నత చదువులు చదివించాలని, ఉన్నత స్థితిలో చూడాలని కలలు కన్న ఓ తండ్రి ఉన్న ఊరిలో బతుకు దెరువు లేక దుబాయికి పయనమయ్యాడు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం, ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవడం కోసం మరో తండ్రి కూడా దుబాయి విమానం ఎక్కాడు. తూర్పు గోదావరి పెరవలి మండలానికి చెందిన మీసాల ఈశ్వరుడు, మొల్లేటి సత్యనారాయణ, పక్కపక్క ఊర్లే అయినా వాళ్లెప్పుడూ కలుసుకోలేదు. మాట్లాడుకోలేదు. అయితే వలస జీవితం వాళ్లని ఒకటి చేసింది. విచారించాల్సిన విషయమేమంటే, అది జీవితంలో కాదు.. మరణంలో.



దుబాయ్‌లోని సూపర్ మార్కెట్లో చాలా తక్కువ జీతానికే వాళ్లిద్దరూ పనికి కుదిరారు. ఆ జీతానికే తమ కడుపు నింపుకోవాలి. గూడు ఏర్పరచుకోవాలి. ఊళ్లో ఉన్న భార్యాపిల్లలకు పంపాలి. అందుకే ప్రమాదమని తెలిసినా శిథిలస్థితిలో ఉన్న, పదుల సంఖ్యలో నివసించే వీలున్న ఓ ఇరుకు భవంతిలో వందలమంది ఆశ్రయం పొందిన చోటే తమ బతుకునూ బాగు చేసుకుందామనుకున్నారు. పదేళ్లుగా అదే వారి నివాసం. దశాబ్దం కాలంలో ఇంటికి వచ్చింది వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు.

'దూరాన ఉన్న నాన్న, మీ కోసం కష్టపడుతున్నాడని, నాన్న కనిపించడం లేదని ఏడ్వవద్దని ఆ తల్లులు ఎన్నో సార్లు ఆ బిడ్డలకు చెప్పి వుంటారు. కానీ అనుకోని ప్రమాదంలో ఆ తండ్రులిద్దరూ కాలిన గాయాలతో మాంసం ముద్దలుగా, గుర్తుపట్టడానికి వీల్లేనటువంటి స్థితిలో ఆ ఇళ్లకు చేరారు. ఎంత విషాదం, ఎంత బాధాకరం! ఈ బాధ ఆ బిడ్డలది మాత్రమే కాదు. ఈ ప్రమాదంలో తండ్రులను కోల్పోయిన ఎందరో పిల్లలది.

భారతదేశం ఇటువంటి వలస జీవుల విషాదగాథలతో నిండిపోయింది. దేశం వెలుపలే కాదు. దేశంలో కూడా ఎందరో శ్రమజీవులు భార్యబిడ్డలను వదిలిపెట్టి, ప్రాణాలను పణంగా పెట్టి జీవిస్తున్నారు. భవన నిర్మాణరంగ కార్మికులు, రైతు కూలీలు, డ్రైవర్లు, వంటపనివారు, ప్లంబర్లు, ఇంటి పనిచేసేవారు, వడ్రంగులు, కరెంటు పనిచేసేవారు.. ఇలా ఎంతోమంది కార్మికులు ఉపాధి కోసం, మెరుగైన జీవన స్థితుల కోసం విదేశాలకు వలసవెళ్తున్నారు. దేశ ఆర్థిక స్థితి మెరుగుపడడంలో ఈ వలసజీవుల కష్టం ఎంతో ఉంది. వాళ్ల ఇంట్లో వెలుగుతున్న పొయ్యి, దేశ అభివృద్ధిలో కీలకంగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. దక్షిణ భారతదేశంలోకెల్లా, కేరళ రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి చెందడం వెనుక, విదేశాల్లో స్థిరపడ్డ వలసదారులే ముఖ్యమని చెప్పొచ్చు.

ఈ ప్రమాదం జరిగిన తరువాత భారతదేశం నుంచి విదేశాలకు వలసపోతున్న కార్మికుల జీవితాలపై మరోసారి చర్చ జరుగుతోంది. ప్రపంచ దేశాలకు అత్యధిక సంఖ్యలో బ్లూ కాలర్ కార్మికులను ఎగుమతి చేస్తోన్న ఏకైక దేశం మనది. ప్రపంచంలో ఎక్కడ ఏ మూల ఏ సంఘటన జరిగినా, అందులో మన భారతీయులు తప్పక ఉంటారు. ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్నప్పుడు వందలమంది భారతీయులు స్వదేశానికి తిరిగివచ్చారు. చదువు కోసం, ఉపాధి కోసం వారంతా అక్కడ ఉన్నారని తెలిసి భారతీయులంతా అవాక్కయ్యారు. ఆ యుద్ధంలో మరణించిన వారిలో కూడా మన దేశీయులు ఉన్నారు. అలాగే, ఉపాధి కోసం, అక్రమంగా విదేశాల్లో స్థిరపడ్డ వారిలో కూడా మన వారే అధికంగా ఉంటున్నారని ఎన్నోసార్లు రుజువైంది. 2023లో 96 వేల పైచిలుకు భారతీయ కార్మికులు తమ దేశంలోకి చొరబడ్డానికి సిద్ధపడ్డారని యుఎస్ మీడియాలో అప్పట్లో వార్తలు వచ్చాయి. అంతకుముందే, 2014లో తమకు తాముగా స్వీయ నిర్బంధం చేసుకొని ఓ కార్గోషిప్ ద్వారా అక్రమంగా ఇంగ్లీషు కెనాల్ దాటుతున్న 34 మంది భారతీయ కార్మికులు అస్వస్థతకు గురవ్వడం అప్పట్లో సంచలనం సృష్టించింది. లాక్‌డౌన్ సమయంలో యుఎస్, కెనడా సరిహద్దును అక్రమంగా దాటేందుకు ప్రయత్నించిన గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం, మంచు తుపానులో చిక్కుకుని ప్రాణాలు విడవడం కూడా చూశాం. అంటే ఉపాధి కోసం చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా కుటుంబాలకు కుటుంబాలు విదేశాల్లో తలదాచుకుంటున్నాయి.



విదేశాల్లో స్థిరపడ్డ భారతీయుల్లో ఎక్కువ శాతం మంది గల్ఫ్ దేశాల్లోనే ఉపాధి చూసుకుంటున్నారు. 1973లో చమురు రంగంలో వచ్చిన గణనీయ మార్పు, ఆ దేశ ఉపాధి రంగాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది. ఉపాధి కోసం, విదేశాల నుండి లక్షలాది కార్మికులు అక్కడికి చేరుకున్నారు. ఒక్క మన దేశం నుండే 85 లక్షల మంది కార్మికులు అక్కడ ఉపాధి పొందుతున్నారు. కేరళ నుండి అధికంగా, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తరువాత ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్ రాష్ట్రాలు వరుసగా ఆ జాబితాలో ఉన్నాయి.

ఉపాధి కోసం ఆయా దేశాలకు వలసవెళ్లిన కార్మికులు అక్కడ దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని అడపా దడపా వార్తలు వస్తూనే ఉంటాయి. యజమానుల వేధింపులు, పాస్‌పోర్టులు లాక్కుని నిర్బంధంగా పనులు చేయించుకోవడం, ఎక్కువ పనిగంటలు, అధిక శ్రమతో అనారోగ్యం పాలైన ఎంతోమంది వేతన జీవులు బతుకుజీవుడా అనుకుంటూ స్వదేశానికి వచ్చిన సంఘటనలు కూడా వింటూనే ఉంటాం. అనుకోని ప్రమాదాల్లో అశువులు బాస్తున్న వారి సంఖ్య కూడా ఏడాదికేడాది పెరుగుతూనే ఉంటుంది. కష్టాన్ని నమ్ముకుని, కోటి ఆశలతో, కలలతో సుదూరాలు తరలిపోతున్న ఈ వలసజీవులు, అర్ధంతరంగా జీవితాలను కోల్పోతున్న బాధ ఆ కుటుంబాలకు తీరని వేదన. ఆ బిడ్డలకు అంతులేని విషాదం..


ఐఐటి మద్రాసు చూశాను ...

హాయ్ ఫ్రెండ్స్,



నా పేరు నీర్జన. నేను ఈ వేసవి సెలవుల్లో ఐఐటి మద్రాసుకు వెళ్లాను. అక్కటి వాతావరణం చాలా బాగుంది. చుట్టూ చెట్లతో కాలుష్యం లేని పర్యావరణంలో గడపడం నాకు బాగా నచ్చింది. అక్కడ జింకలను చూసాము. అవి మనుషులతో పాటు తిరగడం నాకు ఆశ్చర్యం అనిపించింది. ఈ ఐఐటి మద్రాస్ నిర్మాణం మొత్తం 850 ఎకరాల్లో జరిగింది. ఇది చూడడానికి గొప్పగా ఉంది. అక్కడ ఎర్రని రెండు తలలు గల వింత కీటకాలను కూడా చూసాము. స్పిక్ మేకే అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా మాకు ఈ కన్వెన్షన్ అవకాశం వచ్చింది. ఆరు రోజుల పాటు ఈ కన్వెన్షన్ నిర్వహించారు. విద్యార్థులు, కళాకారుల మధ్య మంచి వాతావరణం కల్పిస్తూ, భారతదేశ సాంప్రదాయాలను సజీవంగా ఉంచడంతో ఈ సంస్థ ఎంతో కృషి చేస్తోంది. కన్వెన్షన్‌లో భాగంగా ప్రతిరోజూ, మూడింటికి లేవడం, యోగా చేయడం, ఇంటెన్సివ్‌లో పాల్గొనడం మా దినచర్య. సమయం వధా చేయకుండా ప్రతిక్షణం ఆస్వాదించాం. ఈ ఆరు రోజులు సెల్‌ఫోన్ ఆలోచన రాలేదు. అక్కడ మాకు లాగే ఇతర రాష్ట్రాల్లో పిల్లలు కూడా వచ్చారు. వాళ్లతో మాకు స్నేహాలు ఏర్పడ్డాయి. నేను అక్కడ 'సింగి చామ్' అనే ఇంటెన్సివ్‌లో పాల్గొన్నాను. ఇది సిక్కిం రాష్ట్రానికి చెందిన ఒక కళ. ఇది బుటియా కమ్యూనిటీకి చెందిన ప్రజలు చేస్తారు. ఇది (స్నో లయన్) మంచు సింహానికి, అక్కడున్న ప్రజలకు మధ్య సంబంధాన్ని కనపరుస్తుంది. ఈ 'సింగి చామ్' అనే నృత్యాన్ని ఏదైనా శుభకార్యాలు జరిగే ముందు ప్రదర్శిస్తారు. మా గురువుల దగ్గర నేను ఈ నృత్యాన్ని నేర్చుకున్నాను. మా ట్రిప్‌లో చివరి రోజు మహాబలిపురం వెళ్లాం. మా ప్రయాణాలలో మా ఉపాధ్యాయులు ఎంతో సహాయపడ్డారు. ఈ అమూల్యమైన అవకాశాన్ని కల్పించిన మా పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు.


- కె.నీర్జన, పదవ తరగతి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి.



బొమ్మ సరిచేయండి

పిల్లలూ, మధ్యలో ఉన్న అచ్చు బొమ్మలో పక్కనే ఉన్న ఆకారాలను అంకెల ఆధారంగా సరైన క్రమంలో పేరిస్తే అందమైన కుక్కపిల్ల బొమ్మ వస్తుంది. ట్రై చేయండి చూద్దాం.

బొమ్మరిల్లు





కె.తన్వి,
9వ తరగతి,
శ్రీ చైతన్య టెక్నో స్కూలు,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68